# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి : 12 సంచిక : 8 జులై 2023 వెల : రూ.5/-




రాజమండ్రిలో జరిగిన మహానాడులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడును కలసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధివర్గం



విశాఖపట్నంలో జరిగిన మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని, జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, మాజీమంత్రి అవంతి శ్రీనివాసరావు తదితరులు



అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన కార్యక్రమంలో 2023 నాటా అవార్డ్ ఇన్ జర్నలిజం ఎక్సలెన్సీ అవార్డ్ అందుకున్న సీనియర్ జర్నలిస్టు, ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

# అగ్రి జర్నలిస్టు గోపికి సత్కారం




ఆలిండియా రేడియోలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసే ఇటీవలే పదవీవిరమణ చేసిన అగ్రి జర్నలిస్టు వలేటి గోపీచంద్‌కు హైదరాబాద్‌లో జర్నలిస్టు మిత్రులతో పాటు రైతునేస్తం ఫౌండేషన్ తరఫున సత్కరించారు. రేడియోలో వ్యవసాయ కార్యక్రమాలను నిర్వహించే బాధ్యునిగా, మీడియా మిత్రులకు రైతులకు సంబంధించిన సమాచారం అందించే మంచి వనరుగా ఉన్న గోపీచంద్ రిటైరైన సందర్భాన్ని పురస్కరించుకుని మిత్రులు అభినందనలు తెలియజేశారు. గోపీకున్న విస్తృత పరిచయాల దృష్ట్యా పలు సంస్థలు సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నాయి. జర్నలిస్టు ఫెడరేషన్‌తో ఆయనకున్న సాన్నిహిత్యాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో చిరు సత్కార కార్యక్రమం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

సంపుటి: 12 జులై 2023 సంచిక: 8


## లోపలి పేజీల్లో...


జర్నలిస్టు సమస్యలపై ప్రత్యేక దృష్టి ............. 4
సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం ........... 5
తమిళనాడులో జర్నలిస్టుల పెన్షన్ పెంపు ............................... 6
ఆర్ఎసి జారీ చేసిన ఉత్తర్వు......................... 7
జెఎన్ఎ స్థలాలు ఎందుకు అప్పగించరు? ........................... 8
విలేకరిపై దాడిచేసిన వారిని శిక్షించాలి ....................... 10
కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న పురస్కారం .................................. 11
దేశం పరువు తీసిన గాడ్సే వారసులు ............................ 12
జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి ..................... 15
ఇండిపెండెంట్ జర్నలిస్టు చందు ప్రస్తావించిన ....... 16
ఈనాడు ప్రతినిధి దుర్గాప్రసాద్‌కు అవార్డు ....... 18
ఉనికి కోల్పోయిన స్వతంత్ర జర్నలిజం ............ 19



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

జి.ఆంజనేయులు
వి.నవీన్‌రాజ్
బి.ఎన్.ప్రసాదరావు
వి.రామారావు
బి. ఈశ్వరరావు
టి.మద్దులేటి
ఒ.శాంతి
కె.ఎస్.శంకరరావు
డి.మధుసూదనరావు
ఎస్.వెంకట్రావు
ఎమ్. శ్రీనివాస్
వి.గోపి
ఆర్.రామాంజనేయులు
కె.వేణుగోపాలరావు
వి.భక్తవత్సలం
ఎస్.మురళీశంకర్
జి. శీనుబాబు

డిజైనర్:

PUBLISHED, PRINTED AND EDITED BY
G. Anjaneyulu on behalf of
Andhra Pradesh Working
Journalists Federation
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi
Sapphire, Golconda 'X' Roads, Musheerabad,
Hyderabad-500 020, A.P. Ph:040-27671067

PRINTED AT
Prajashakthi, M.B. Bhavan, Near RTC Cross
Roads, Hyderabad-500 020.

EDITOR
A.Amaraiah
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494
RNI No. APMUL/2009/37690


# ఈ తీర్పు ఎవరి మేలు కోసం?

సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులకు సంబంధించి పోలీసులు పెడుతున్న కేసులు ఇకపై చెల్లవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐటి చట్టం 2000 లోని 66ఎ నిబంధన రద్దు చేయడం వల్ల ఈ వెసులుబాటు కలిగింది. 2015 మార్చి 24వ తేదీ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వంపై శ్రేయా సింఘాల్ దాఖలు చేసిన కేసు విచారించిన కోర్టు 66ఎ నిబంధన రద్దు చేసింది. అయినప్పటికీ పలు రాష్ట్రాల్లో సోషల్ మీడియా పోస్టింగులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ హెూం మంత్రిత్వ శాఖ జులై 14వ తేదీన స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో 66ఎ నిబంధన రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అనేక రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసులు సోషల్ మీడియాకు సంబంధించిన కేసులు నమోదు చేస్తున్న విషయం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై కేంద్రం స్పందించి అన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టు ఆదేశాలు తుచ తప్పకుండా పాటించాలని ఆదేశించింది. పోలీసు శాఖను, స్థానిక పోలీసు అధికారులను ఈ అంశంపై చైతన్యపరిచేందుకు తగిన చర్యలు చేపట్టమని 2019లో అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లోని కొందరు పోలీసు అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని స్థానిక పోలీసు అధికారులు సుప్రీంకోర్టు రద్దు చేసిన 66ఎ నిబంధన కింద కేసులు నమోదు చేయవద్దని, ఈ అంశంపై పోలీసు అధికారులను చైతన్యపరిచే చర్యలను తక్షణమే చేపట్టాలని కోరింది. సోషల్ మీడియా విస్తృతి మరింతగా పెరుగుతున్న నేపథ్యంలో సమాచార వెల్లువ మరింతగా ముంచెత్తుతున్నది. మారిన పరిస్థితిని గమనించి అన్ని ప్రధాన రాజకీయ పక్షాలు సొంతంగా సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఆంక్షలు, కేసుల అడ్డంకిలేని ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు దారులు వేసుకున్నాయి. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు వెలుగు చూడని అనేక సామాజిక, సాంస్కృతిక అంశాలు ప్రజల ముందుకు వస్తాయనుకుంటే అంతకు మించిన రాజకీయ కాలుష్యం సమాజాన్ని కమ్మేస్తున్నది. రాజకీయ పక్షాలు తమ ధోరణి మార్చుకుని సమాచార విప్లవం మరింత పరిఢవిల్లేందుకు బాటలు వేయాలని వినతి.



# జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

## చంద్రబాబును కలిసిన ఫెడరేషన్ నాయకులు

ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడులో నారా చంద్రబాబునాయడు టీడీపీ జాతీయ అధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) నాయకులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా చంద్రబాబును కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత ప్రమాదకరంగా మారిందని మొత్తంగా మీడియా స్వరూప స్వభావాల్లో వచ్చిన మార్పును ప్రస్తుత పరిస్థితుల్లో అధ్యయనం చేసేందుకు, మీడియా ఉనికికి, ప్రమాణాలకు విఘాతం కలుగకుండా చూసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం ద్వారా మొత్తంగా మీడియాకు మేలు చేకూరుతుందని ఫెడరేషన్ నాయకులు తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మొదటి ప్రెస్ కమిషన్ వేశారని ఆ సిఫారసుల ఆధారంగానే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైందన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన సవరణ చట్టం రావడానికి అప్పట్లో చేసిన అధ్యయనమే కారణమన్నారు. రెండో ప్రెస్ కమిషన్ వేసినా ఆ సిఫారసులు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటి కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఉన్న రెండు చట్టాలను రద్దు చేసిందని, ఈ తరుణంలో రాష్ట్రాల్లో పనిచేస్తున్న ప్రింట్, బ్రాడ్‌కాస్ట్ మీడియాల మనుగడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగేందుకు, అందులో పనిచేసే జర్నలిస్టులు ఇతర సిబ్బందికి తగిన రక్షణ ఉండేందుకు వీలుగా రాష్ట్ర పరిధిలో మీడియా పరిస్థితిని అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం తక్షణ అవసరమని వివరించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలపై నాకు పూర్తి అవగాహన వుందని, తమ పాలనలోనే జర్నలిస్టులకు సంబంధించి ఎన్నో సమస్యల్ని పరిష్కరించామని అన్నారు. మీ సమస్యలపై తప్పక దృష్టి పెడతామన్నారు. రానున్న ఇరవై యేళ్ళలో ఇండియా ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌ను కూడా ఒక గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యతని మనం చేపట్టాల్సి వుందన్నారు. ఈ సందర్భంగా నాయకులు జర్నలిస్టుల సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి.శ్రీనివాస్, కలిమిశ్రీ, శాంతిశ్రీ, బి.యస్. ప్రసాద్, జి.నాగేశ్వరరావు, జిలాని, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమైనదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విశాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి విడుదల రజని పేర్కొన్నారు. కేజీహెచ్ డౌన్లోని డాల్ఫిన్ డయాగ్నొస్టిక్ సెంటర్లో అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఉచిత హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని జూన్ 10న ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత్రికేయులకు ఎన్ని కష్టాలు ఉన్నా విలువల కోసం పనిచేస్తారని వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పదివేల రూపాయలకు పైగా విలువ చేసే 56 రకాల పరీక్షలను ఉచితంగా డాల్ఫిన్ దయాగ్నస్టిక్స్ సెంటర్లో చేస్తున్నట్లు ఆమె వివరించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన అత్యవసర చికిత్సలు ఉచితంగానే అందిస్తామన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కొత్తగా మంజూరైన అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే తెల్ల రేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీంకు సంబంధించి ఆరోగ్య భీమా మొత్తాన్ని సిఎస్ఆర్ నిధుల నుంచి చెల్లిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులకు మంత్రి, కలెక్టర్ అందించారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ సంబంధించి మూడు లక్షల డెబ్బైఐదు వేల రూపాయల బీమా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు ఎంవివి సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు అవంతి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డితో పాటు జర్నలిస్టులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన డాల్ఫిన్ దయాగ్నొస్టిక్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి సురేష్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేడియోలజిస్ట్ డాక్టర్ బి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు,



## జర్నలిస్టు కరీముల్లా మృతి

గుంటూరు జిల్లా పొన్నూరులో సీనియర్ జర్నలిస్ట్ షేక్ కరీముల్లా (70) మరణించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కరీముల్లాకు భార్య , ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వివిధ పత్రికల్లో పనిచేసిన కరీముల్లా దాదాపు 25 ఏళ్ల పాటు పొన్నూరులో ఆంధ్రభూమి విలేఖరిగా పనిచేసారు. కొంతకాలం గుంటూరు జిల్లా జర్నలిస్టు యూనియన్ కార్యదర్శిగా పనిచేసారు. కరీముల్లా మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి.ఎన్.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు రత్నాకర్‌లు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# కొమ్మినేనికి జర్నలిజం ఎక్సలెన్సీ అవార్డు

2023 నాటా అవార్డ్ ఇన్ జర్నలిజం ఎక్సలెన్సీ అవార్డ్‌కు సీనియర్ జర్నలిస్టు, ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఎంపికయ్యారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఉత్తర అమెరికా తెలుగు సమితి ( నాటా) ఈ అవార్డును ప్రదానం చేసింది. 46యేళ్ళ జర్నలిజంలో వివిధ పత్రికలు, ఛానెళ్ళలో నిబద్ధతతో పని చేసిన సుదీర్ఘ అనుభవం కొమ్మినేని సొంతం. కె.ఎస్.ఆర్ లైవ్ షో పేరున తెలుగు రాష్ట్రాల్లో వారు ప్రసిద్ధులు. నాటా ఆహ్వానం మేరకు సి. ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అమెరికాకు జూన్ 29న వెళ్ళారు. ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) ఆధ్వర్యంలో ఏటా జరిగే తెలుగు ప్రజల ఉత్సవాలను ఈ ఏడాది 2023 అమెరికాలోని డల్లాస్‌లోని డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. జూన్ 30 నుండి జులై 2 వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రోత్సహిస్తూ వివిధ రంగాలలోని ప్రముఖులను, ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన పెద్దలను సన్మానించారు. 2023 సంవత్సర నాటా అవార్డు ఇన్ జర్నలిజం ఎక్స్ లెన్స్ అవార్డును అందుకునేందుకు కొమ్మినేని శ్రీనివాస రావు అమెరికాకు జులై 1 నాటికి చేరుకుని తిరిగి జులై 16 న విజయవాడ తిరిగివచ్చారు.

# తమిళనాడులో జర్నలిస్టుల పెన్షన్ పెంపు

జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం దేశవ్యాప్తంగా కల్పించేందుకు వీలైన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని జర్నలిస్టు సంఘాలు చాలా సంవత్సరాలుగా కోరుతున్నాయి. కేంద్రం దీనిపై స్పందించలేదు. కాని దేశంలోని పలు రాష్ట్రాల్లో పలు రకాలుగా పెన్షన్ పథకాన్ని పరిమితంగానైనా జర్నలిస్టులకు ఇస్తున్నారు. అందులో తమిళనాడు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి తొలుత 250 రూపాయల పెన్షన్ 1986లో ఇస్తే ఇప్పుడది 12వేల రూపాయలకు పెంచింది. జర్నలిస్టుల పెన్షన్ మొత్తాన్ని తమిళనాడు ప్రభుత్వం పెంచడం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) అధ్యక్షులు ఎస్.కె.పాండే, సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. తమిళనాట పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఈ పెన్షన్ సదుపాయం కల్పించేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తిచేశారు. తమిళనాడు ప్రభుత్వం రిటైర్డ్ జర్నలిస్టులకు ప్రతినెలా ఇచ్చే పింఛనును పదివేల నుంచి 12 వేలకు పెంచుతూ జూన్ 14వ తేదీ జీవో జారీ చేసింది. తొలిసారిగా తమిళనాడు ప్రభుత్వం జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వడాన్ని 1986 ఏప్రిల్ 3వ తేదీ ప్రారంభించింది. అప్పట్లో 250 రూపాయలు జర్నలిస్టులకు పెన్షన్‌గా ఇచ్చేవారు. నాటి నుంచి వివిధ సందర్భాల్లో పెన్షన్ మొత్తాన్ని పెంచారు. 2010 జులై 16వ తేదీ నుంచి ఆ మొత్తాన్ని ఐదు వేల రూపాయలకు పెంచారు. 2013 అక్టోబరు 7వ తేదీ నుంచి 7వేల ఐదు వందలు చేశారు. 2016 జనవరి 11 నుంచి ఎనిమిది వేల రూపాయల పెన్షన్ ఇచ్చేందుకు నిర్ణయించారు. 2017 సెప్టెంబరు 21నుంచి పెన్షన్ పదివేల రూపాయలు చేశారు. ఇప్పుడది నెలక 12 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ సమాచార శాఖ మంత్రి శాసనసభలో ప్రకటన చేశారు. అనంతరం ఆ మేరకు ప్రభుత్వం 2023 జూన్ 14వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు ప్రభుత్వం జర్నలిస్టులకు కొనసాగిస్తున్న పథకాన్ని మిగిలిన అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) అన్ని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది.

# మీడియాకు కేరళ హైకోర్టు సూచన

## అనుచిత వ్యాఖ్యానాలు చేయవద్దని హితవు

కోర్టు విచారణలో ఉన్న సమయంలో కేసుకు సంబంధించి లేదా సాధారణంగా న్యాయమూర్తి ఏదైనా వ్యాఖ్య చేస్తే దాన్ని పరిగణనలోకి తీసుకుని వార్తగా మలచవద్దని కేరళ హైకోర్టు మీడియాకు సూచించింది. కోర్టు కేసులపై వార్తలు అందించే విషయంలో బాధ్యతాయుత పాత్రికేయ ప్రమాణాలు పాటించాలని మీడియాకు కేరళ హైకోర్టు సూచించింది. విచారణ సమయంలో న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యల ఆధారంగా అనుచిత కామెంట్లు వ్యాఖ్యానాలు చేయకూడదని హితవు పలికింది. వాటి వల్ల వ్యాజ్యదారుల గౌరవం, ప్రతిష్టలకు నష్టం కలిగే ముప్పు ఉంటుందని హెచ్చరించింది.

కేరళ సీఎం పినరాయి విజయన్‌కు ప్రైవేట్ కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న వ్యక్తి భార్య ప్రియా వర్గీస్‌కు కన్ననూరు విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించిన వ్యవహారానికి సంబంధించిన కేసులో మీడియా కవరేజీని ఉద్దేశించి జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్, జస్టిస్ మహమ్మద్ నియాజ్ సిపిల ధర్మాసనం జూన్ 23న ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది.

విచారణ సమయంలో కోర్టులో న్యాయవాదులతో జడ్జి మాట్లాడిన మాటలన్నింటినీ కేసుకు సంబంధించిన ఆయన లేదా ఆమె అభిప్రాయాలుగా పరిగణించాల్సిన అవసరం లేదని భారత ప్రధాన న్యాయమూర్తి కూడా ఇటీవల పేర్కొన్న సంగతిని ధర్మాసనం గుర్తుచేసింది. కోర్టు కేసులపై వార్తల్లో బాధ్యతాయుత పాత్రికేయ ప్రమాణాలు పాటించాలని మీడియాకు కేరళ హైకోర్టు సూచించింది. విచారణ సమయంలో న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యల ఆధారంగా అనుచిత కామెంట్లు వ్యాఖ్యానాలు చేయకూడదని హితవు పలికింది. వాటి వల్ల వ్యాజ్యదారుల గౌరవం ప్రతిష్టలకు నష్టం కలిగే ముప్పు ఉంటుందని హెచ్చరించింది.

**Andhra Pradesh State Road Transport Corporation**

Office of the Managing Director,
RTC House, Vijayawada,
Dt.12.05.2023.

NO.PR/543(2)/2023-PRD

To

All the District Public Transport Officers,

Sub: Journalist Passes – Issue of concessional Bus Passes to the Accredited Journalists for a validity period of 2023-2024-Issue of guidelines - Reg.

Ref: Letter.No.007090/MR/2022, dt.11.05.2023 of Commissioner, Information and Public Relations Department, Vijayawada.

***

The Commissioner, Information and Public Relations Department, Vijayawada vide letter at reference cited, communicated the following resolutions regarding provision of Bus Pass facility by the APSRTC authorities to working journalists.

1. To extend the Bus Pass facility to the geographical area of the erstwhile Districts to the Journalists of concerned Districts. For ex: Journalists of erstwhile Krishna District shall be permitted to travel in the restructured Krishna and NTR Districts.

2. Regarding Bus Pass facility to the Journalists working in NTR District, they may be permitted to travel free to Secretariat and High Court (which are in Guntur District) and also the Journalists working in Guntur District may be permitted to travel free to Vijayawada and its sub urban areas also (as most of the HODs are located in Vijayawada).

3. To extend the Bus Pass facility to travel in APSRTC buses wherever the APSRTC bus services are available.

In this connection, it is decided to issue Journalist Passes with validity up to 31.12.2023 duly verifying the Accreditations of media representatives.

Action in this regard shall be taken accordingly.

**EXECUTIVE DIRECTOR (A)**

Copy to ED(O)/HO/Vja for information
Copy to CE (IT)/HO/VJA for information
Copy to Dy.CE (IT)/HO/VJA for information

**ఆంధ్రప్రదేశ్‌లోని జర్నలిస్టులు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించే సదుపాయానికి సంబంధించి రోడ్డు రవాణా సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. కానీ జర్నలిస్టులు పాత జిల్లాల భౌగోళిక పరిధిలో ప్రయాణించేందుకు అనుమతి ఇస్తూ ఆర్‌టిసి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 2023 డిసెంబరు 31వరకు అమల్లో ఉంటాయి. దీనివల్ల గతంలో జర్నలిస్టులకు ఆర్‌టిసిలో ఎలాంటి సదుపాయం ఉందో అదే సదుపాయం అమలవుతుంది.**




# జెఎన్‌జే స్థలాలు ఎందుకు అప్పగించరు?

జవహర్ లాల్ నెహ్రూ మ్యాక్ హౌజింగ్ సొసైటీకి ఇళ్ళ స్థలాలను ఎందుకు అప్పగించడం లేదని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి పదినెలలు పూర్తయినా ఈ స్థలాలు స్వాధీనం చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్థలాల స్వాధీనం కోసం అన్ని రాజకీయ పక్షాలను సమన్వయం చేసుకుని, ఉద్యమ కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని జెఎన్‌జె సభ్యులకు సూచించారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఎన్‌జే సొసైటీ ఫౌండర్ మెంబర్ పివి రమణరావు అధ్యక్షతన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యాక్ హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జే మ్యాక్ హెచ్ఎస్) మీడియా సంపాదకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఆంధ్ర జ్యోతి ఎడిటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తుది తీర్పు తరువాత కూడా సుధీర్ఘకాలం ఆ తీర్పు అమలు కాకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. జేఎన్‌జే సొసైటీ మేనేజింగ్ కమిటీ ప్రభుత్వానికి చేరువగా వున్నా ఏమాత్రం సభ్యులకు ఉపయోగ పడకపోవడం విచారకరమన్నారు. ఎన్నికలు దగ్గర పడుతోన్న సందర్భంలో సుప్రీం తుదితీర్పు వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంలో తక్షణమే కోర్టు ధిక్కరణకు వెళ్లాల్సిందేనని ఆయన సూచించారు. జేఎన్‌జే స్థలాలు వారికే స్వాధీనం చెయ్యాలని గతంలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కు సూచించానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ స్థలాలు విషయంలో ఎందుకు ఆలస్యం చేస్తుందో అర్థకావడంలేదన్నారు. జేఎన్‌జే కి చెందిన 1100మంది సభ్యులతో మిగతా 5 వేలమంది స్థలాలతో ముడిపెట్టడం భావ్యం కాదని అన్నారు. ప్రభుత్వం చెడు ఆలోచనను ప్రశ్నించాల్సిందేనని స్పష్టం చేశారు. మీరు చేసే ఉద్యమానికి ప్రతిపక్షాల, ప్రజాసంఘాల సహకారం తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సలహా ఇచ్చారు. సుప్రీంతీర్పు అమలు ఎందుకు చేయడం లేదనే విషయాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించాల్సి వుంది. అయితే, ప్రభుత్వం సొసైటీ సభ్యులు ఇచ్చిన వినతి ప్రతాలకు సమాధానం చెప్పాల్సి వుండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సమస్య జఠిలంగా మారిందన్నారు.

### ఇదే సరైన సమయం : దిలీప్ రెడ్డి

ఎన్నికల సమయంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్థలాలు సాధించుకోవాలని ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలోనే పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతాయని, ఇందులో భాగంగానే ఈ జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్య కూడా పరిష్కారమవుతోందని చెప్పారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు దఫాలుగా ఇళ్ళస్థలాలు ఇచ్చిన చరిత్ర వుందని, ప్రస్తుతం జెఎన్‌జె సొసైటీకి సంబంధించి స్థలాల అప్పగింత అంశం సుదీర్ఘంగా కొనసాగుతూనే వుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తలచుకుంటే కోర్టు కేసులను కాదని ఇచ్చే అవకాశంకూడా వుందని, కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదని దిలీప్‌రెడ్డి స్పష్టం చేశారు.

### జీవన్మరణ సమస్య: మిట్టపల్లి శ్రీనివాస్

మన తెలంగాణ సంపాదకులు మిట్టపల్లి

శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల స్థలాల సమస్య జీవన్మరణ సమస్యగా గుర్తించి ప్రభుత్వం స్పందించాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో జర్నలిస్టులు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేవిధంగా కార్యక్రమాలు చేపడుతున్నారనీ, దీనిని తప్పుగా భావించకుండా స్థలాలను స్వాధీనం చేయాలన్నారు. పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని వెంటనే సొసైటీకి స్వాధీనపర్చాలన్నారు. ఈ స్థలాల స్వాధీనం కోసం అవసరమైతే నిరాహార దీక్షలు నిర్విరామంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్దతిలో, గాంధేయ విధానంలో ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని సూచించారు. జర్నలిస్టులకు స్థలాల విషయంలో ఏకాభిప్రాయం వున్నదని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి స్పష్టం చేశారు. స్థలాల కోసం జర్నస్టులంతా సామ, ధాన భేద దండోపాయాలను అనుసరించాల్సిందేనని ఆయన సూచించారు. ఎన్నికల ప్రకటన వెలువడేలోగా ఇళ్లస్థలాల సాధన ఉద్యమం తీవ్రతరం చేయాలన్నారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని మరింత చైతన్యంగా పోరాటం చేయాలని, అందరి సంఘీభావమే పునాధిగా ఏర్పరచుకుని, ముందుకు సాగాలని యాదగిరి అన్నారు. కలాలను పాశుపతాస్త్రాలుగా సంధించి స్థలాలు సాధించాలని పిలుపునిచ్చారు. జేఎన్‌జే సొసైటీ మేనేజింగ్ కమిటీ సరిగ్గా పనిచేయకపోవడం వలనే ఈ దారుణమైన పరిస్థితి ఏర్పడిందని టివి9 అసైన్‌మెంట్ ఎడిటర్ జగన్మోహనరెడ్డి అన్నారు. సభ్యులే టీమ్ జేఎన్‌జేగా ఏర్పడి పోరాటం చేయడంపట్ల ఆయన అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జి. అంజనేయులు మాట్లాడుతూ హైదరాబాద్ జర్నలిస్టులు ఏం పాపం చేశారని, వారికి ఇళ్ళ స్థలాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తుందో అర్థం కావడంలేదన్నారు. జేఎన్‌జే సభ్యుల పోరాటం వల్ల ఇళ్ళస్థలాలు సాధించడం సానుకూల పరిస్థితులు ఏర్పడగలవన్నారు. సీనియర్ జర్నలిస్టు వ్యాడం మధు మాట్లాడుతూ జేఎన్‌జే సభ్యుల లక్ష్యం ఒక్కటేనని, ఇందులో ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఎంతో మంది సభ్యులు చనిపోయారని, వారి ఆత్మలు స్థలాలకోసం ఘోషిస్తున్నాయన్నారు. నాడు 2 లక్షల రూపాయల విలువైన స్థలాలు అవి నేడు 2 కోట్ల రూపాయలని అన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్‌కు క్షీరాభిషేకం చేసిన సభ్యుల కళ్ళల్లో నేడు రక్తం కన్పిస్తోందన్నారు. 70 ఎకరాల స్థలం మనదేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా ఎందుకు జాప్యంజరుగుతోందని మెట్రో దినప్రతిక సంపాదకులు దేవరకొండ కాళీదాస్ ఆవేదన వ్యక్తం చేసారు.

అధ్యక్షత వహించిన జెఎన్‌జే ఫౌండర్ మెంబర్ పి వి రమణరావు మాట్లాడుతూ ప్రతిసభ్యునికి స్థలాలు వచ్చేలాగా పోరాటం వుంటుందని స్పష్టం చేసారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంపాదకులతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్య మంత్రి కే సి ఆర్ కు అందజేస్తామని ఆయన తెలిపారు. యూ.ఎన్.ఐ. బ్యూరో చీఫ్ నాగేశ్వరరావు, బిసి టైమ్స్ సంపాదకులు సూర్యారావు, సీనియర్ జర్నలిస్టులు ఆకుల అమరయ్య, మాలకొండయ్య, సుందరశర్మ, కెవిఎస్ సుబ్రమణ్యం తదితరులు మాట్లాడారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంపాదకుల సంతకాలతో కూడిన వినతి పత్రం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని తక్షణమే జెఎన్‌జె సొసైటీకి అప్పగించాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అలాగే పేట్ బషీరాబాద్ స్థలం స్వాధీనం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను సిద్దం చేసింది. ఈ కార్యక్రమంలో వివిధ మీడియా సంస్థలకు చెందిన సంపాదకులు మరియు జెఎన్‌జె సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జర్నలిస్టు అశోక్ మృతి

మలక్ పేట సివిఆర్ న్యూస్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న అశోక్ గుండెపోటుతో ఆకస్మికంగా జూన్ 3వ తేదీ చనిపోయారు. వైద్యచికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయన స్వగ్రామం కందుకూర్ మండల్ తిమ్మాపూర్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతికి ఎన్ఎజె తెలంగాణ కన్వీనర్ ఎంఎ రవూఫ్ సంతాపం వ్యక్తం చేశారు.



# విలేకరి పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలి

నంద్యాల జిల్లా మహానంది మండలం పనిచేస్తున్న వార్త విలేకరి మధు పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జులై 17న మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్కిల్లో విలేకరులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెల్లి ఏఎస్ఐకు వినతి పత్రం అందజేశారు. తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్యకు




వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విలేకరులపై దాడులు పెరిగాయని, విలేకరులకు రక్షణ కరువైందన్నారు. నంద్యాల జిల్లా మహానంది వార్త విలేఖరి మధుపై మండల వైసిపి నాయకులు దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. పత్రికారంగా స్వేచ్ఛ అరిస్తున్నారని, జర్నలిస్టులో గుర్తింపు కార్డులు ఇవ్వడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. విలేకరులకు తక్షణమే భద్రత కల్పించాలని, దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయుడు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ పాణ్యం నియోజవర్గ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, శ్యాంసుందర్ రెడ్డి, ఎల్లసుబ్బయ్య, మహమ్మద్ సలేహా, మహేష్ బాబు, అరుణ్ భాష, మస్తాన్, రఫీ, రాజేష్, లీవికుమార్, రాముడు, చెన్నయ్య పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ:** జర్నలిస్టులపై దాడులు






హేయమైన చర్య అని , దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీడెబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, కోశాధికారి నాగరాజు, తాలూకా గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మహానంది మండల వార్త విలేకరి మధుపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జులై 17న ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మండల తాసిల్దార్ హరినాధరావుకు, పట్టణ సిఐ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద విలేకరులు శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు ఎంతవరకు సమంజసం అన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఖాశిం వలి, ప్యాపిలి ప్రసాద్, అక్షింతల శ్రీనివాసులు, అరుణ్, మహమ్మద్ హుస్సేన్, డిడి8 భాష, జనం దాసు తదితరులు పాల్గొన్నారు.





# కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్య సేవాపురస్కారం

ఆది ఆంధ్రమహాసభకు అధ్యక్షులు, నాడు సమాజంలో ఉన్న వివక్షత, దురాచారాలకు వ్యతిరేకంగా సాహిత్యం, కార్యాచరణతో ఉద్యమించి, సమాన హక్కుల కోసం కార్యకర్తగా, సాహితీవేత్తగా అణగారిన ప్రజల పక్షాన నిలిచిన కుసుమ ధర్మన్న పేరిట ఏర్పాటైన ఈ సాహితీ కళాపీఠం వారి సామాజిక, సాహిత్యసేవా కార్యక్రమాలలో భాగంగా తొలుతగా సాహితీరంగం నుండి ఇస్తున్న సాహిత్యసేవా పురస్కారం విజయవాడకు చెందిన నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీకి జులై 16వ తేదీ విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

1966 వ సంవత్సరంలో కలిమికొండ బసవయ్య – దేవకమ్మ దంపతుల ఐదవ సంతానంగా జన్మించిన శ్రీ కలిమికొండ సాంబశివరావు ఓ చిన్న చేనేత కుటుంబంలో పుట్టి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు . కొత్తరెడ్డిపాలెం గ్రామంలో హైస్కూల్ చదువు పూర్తి చేసి, అన్నా వదినల సహకారంతో గుంటూరు హిందూ కాలేజీలో సాగిన డిగ్రీ చదువు పూర్తి కాకుండానే ఆపి వేశారు. పదవ తరగతి చదువుతుండగానే తొలి కవిత, తొలి కార్టూన్‌కు శ్రీకారం చుట్టి, కలిమిశ్రీ అనే కలం పేరుతో 1984 నుంచీ విస్తృతంగా కార్టూన్లు, కవితల్లో రాణించారు. కలిమిశ్రీ జీవితం పత్రికా రంగంతో ముడిపడి ఉంది. వీరు గత మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంతో మమేకమై వున్నారు. ఆంధ్రపత్రికతో మొదలైన ఆయన ప్రస్థానం ఆ తరువాత ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్ర, విద్య, ధ్యానమాలిక, రేపటికోసం పత్రికల్లో వివిధ హోదాల్లో కొనసాగింది. భారతి సాహిత్య మాసపత్రిక చివరి మూడు సంచికల్లో పని చేసిన అపారమైన అనుభవం ఆయన సొంతం.

నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విజయవాడ సిటీ కమిటీ అధ్యక్షుడుగా అపారమైన సేవలు అందించారు. మల్లెతీగ ముద్రణల రూపశిల్పి, మల్లెతీగ పురస్కార వ్యవస్థాపకుడు అయిన కలిమిశ్రీ ఎంతో పట్టుదల, నిబద్ధతతో నవమల్లెతీగ సాహిత్య మాసపత్రికను నిరాటంకంగా నడుపుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది సాహితీవేత్తలకు ఆ పత్రికలో చోటు కల్పిస్తున్నారు. ముఖ్యంగా నవ్యాంధ్ర రచయితల సంఘం మల్లెతీగ సాహిత్య సేవా సంస్థల ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తూ కవులు, కళాకారులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను గుర్తిస్తూ గౌరవిస్తున్నారు. మల్లెతీగ సాహితీ పురస్కారంతో ఈతరం కవులు రాస్తున్న మంచి కవిత్వాన్ని రికార్డు చేస్తున్నారు.

కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహితీసేవా పురస్కారాన్ని అందజేస్తూ నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

# 99టీవీ పాత్రికేయునిపై ఫీల్డ్ అసిస్టెంట్ దాడి



నిజాలు నిర్భయంగా రాస్తే దాడులు జరుగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ తన అనుచరులతో కలిసి కాపు కాసి 99 టీవీ రిపోర్టర్ పై దాడి చేశారు. బాధిత పాత్రికేయుడు తన అత్తగారి ఊరు కృష్ణాపురం వెళ్లి ఫ్యామిలీతో తిరిగి వస్తుండగా మారాల సమీపంలోని బాలేనాయక్ తాండ కాలువ మీద దాడి జరిగింది. ఉపాధి హామీ పనుల్లో అవకతవకల గురించి వార్త రావడంతో గొడవ పడి ఈ దాడి చేశారు. ఇందులో పాత్రికేయుడు మూర్తి తీవ్రంగా గాయపడగా, ఆయన భార్య సుప్రియ మెడలోని 4తులాల తాళిబొట్ల గొలుసు, ఒక ఉంగరం, 5వేల నగదు లాక్కొని పోయారు.

ఈ సంఘటనపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అనంతపురం జిల్లా శాఖ స్పందించింది. జర్నలిస్టుపై జరిగిన దాడిని ఖండించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, స్థానిక పోలీసు అధికారులను డిమాండ్ చేసింది. జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు షఫీవుల్లా, ఆర్.రామాంజనేయులు విడుదల చేసిన ప్రకటనలో జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని దోషిని అరెస్టు చేయాలని కోరారు.

# దేశం పరువు తీసిన 'గాడ్సే' వారసులు

ఎస్.వినయకుమార్,
ప్రజాశక్తి పూర్వ సంపాదకులు

తమ రక్తనాళాల్లో ఏపాటి ప్రజాస్వామ్యం ఉందో చూపెట్టుకోవడానికి గాడ్సేలకు ఎక్కువ సమయం పట్టలేదు. భారత ప్రధాని, ఆ పరివారం నేత నరేంద్రమోడీ వైట్‌హౌస్ పత్రికా గోష్టిలో మాట్లాడిన మరునాడే ఆయన మాటల్లోని బండారం ప్రపంచానికి తెలిసిపోయింది.

అతి కష్టం మీద మోడీని సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్స్‌కు ఒప్పించిన వైట్‌హౌస్‌కు పరాభవమే మిగిలింది. ఆ పత్రికా గోష్టిలో భారతదేశంలో ముస్లింలపై జరుగు తోన్న దాడుల గురించి ప్రశ్నించిన వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి సబ్రినా సిద్దిఖీకి అమెరికా లోని గాడ్సే భక్త సమాజం నుండి వేధింపులు ఎదురయ్యాయి.

వైట్ హౌస్ ఆ వేధింపులపై వెంటనే స్పందించి తన పరువు నిల్పుకొంది. డోనాల్డ్ ట్రంప్ ఇంకా అమెరికా అధ్యక్షుడిగా లేడన్న వాస్తవాన్ని గాడ్సే పరివారానికి వైట్ హౌస్ స్పష్టం చేసింది.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో పాటు జరిగిన సంయుక్త ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో నరేంద్రమోడీని భారతదేశంలోని ముస్లింలపై జరుగుతున్న దాడుల గురించి, మానవ హక్కుల గురించి సిద్దిఖీ అడగగా మన ప్రధాని ప్రజాస్వామ్యం మా రక్తనాళాల్లో ఉందని ఆకుకు అందని పోకకు పొందని ఫిల్మీ డైలాగు వల్లెవేసి బయట పడ్డారు.

అడిగిన ప్రశ్నకు సూటిగా ఆయన జవాబు చెప్పలేక పోయారు. ఇద్దరు దేశాధినేతల ఒప్పందం మేరకు విలేకరులు రెండేసి ప్రశ్నలే అడగాలి కనుక సిద్దిఖీ ప్రశ్నపై అనుబంధ ప్రశ్నకు అవకాశం లేదు. అయినప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో మన "ప్రజాస్వామ్యం" పరువు మట్టికరిపించే పనికి గాడ్సే భక్తులు పూనుకొన్నారు. 19 ఏళ్ల తర్వాత మోడీ పాల్గొన్న పత్రికా గోష్టి అలా ముగిసింది.

సిద్దిఖీ ప్రశ్నతో దిమ్మదిరిగిన అమెరికాలోని గాడ్సేలు ఆమెపై వేధింపులు మొదలెట్టారు. మన దేశంలోని స్థానిక గాడ్సేలు డిజిటల్ జర్నలిస్టు తులసీ చందును వేధిస్తున్నట్లుగానే అమెరికన్ గాడ్సేలు కూడా ప్రవర్తించారు. ఉన్నత విద్యలు నేర్చి విదేశాల్లో స్థిరపడినా కుక్కతోకల్లా వారు వంకర బుద్ధులు వదల్లేదు. ట్రోలింగ్‌లపై కంగారు పడిన వైట్ హౌస్ వెంటనే స్పందించింది. అమెరికా నేషనల్ సెక్యూరిటీస్ అధికారి జాన్ కిర్బే ఒక ప్రకటన చేస్తూ రిపోర్టర్లపై వేధింపులను వైట్ హౌస్ (అమెరికా ప్రభుత్వం) ఆమోదించదని స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడి కార్యస్థానం అయిన వైట్ హౌస్ నుండి అలాంటి ప్రకటన రావడం భారతీయులందరికీ అవమానమే.

పత్రికా గోష్టి తర్వాత తనపై సాగిన వేధింపుల మీద సిద్దిఖీ జూన్ 24న ట్వీట్ చేశారు. "నా ప్రశ్నకు కొందరు వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆపాదిస్తున్నారు. కనుక నేను నా విషయాలను వెల్లడించడం సరైందని అనుకొంటున్నాను. కొన్నిసార్లు అస్తిత్వమే చాలా సంక్లిష్టంగా మారుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ ట్వీట్‌లో తాను ఇండియన్ క్రికెట్ టీమ్ జెర్సీ ధరించి ఉన్న ఫొటోను, తన తండ్రితో పాటు 2011 వల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌ను ఇండియన్ టీమ్ జెర్సీలో చూస్తున్న ఫొటోలను పెట్టారు. తన భారతదేశ జాతీయతను, దాని పట్ల ఉన్న ప్రేమను సిద్దిఖీ ఆ విధంగా తెలియ చేసుకోవాల్సి వచ్చింది.

దాన్నిబట్టి ఆమెకు ఎలాంటి వేధింపులు ఎదుర్కొ ఉంటాయో మనం ఊహించవచ్చు. ముస్లిం అయితే నేరుగా అలాంటి వేధింపులకు పాల్పడటం ఒకవేళ హిందువులయితే నీవు ముస్లింకు పుట్టావా? అని ప్రశ్నించడం సంఘీయుల సంస్కృతి. మన ప్రధానికి ఏదో ఉద్దేశాన్ని ఆపాదిస్తూ సిద్దిఖీ ప్రశ్నించలేదు. "భారతదేశంలో మైనారిటీల హక్కులపై జరుగుతున్న దాడుల నుండి మీరు రక్షణ కల్పిస్తారా? ముస్లింల హక్కులను, భావస్వేచ్ఛను రక్షిస్తారా" అని అడిగారు.

ఆ వెంటనే ఆమెపై ట్రోలింగ్‌లు మొదలయ్యాయి. ప్రశ్న వేయడంలో ఆమె ఉద్దేశాన్ని, ఆమె వారసత్వాన్ని ప్రశ్నించి తమను విమర్శించే వారిని సూడో సెక్యులరిస్టులు అని నిందించే ట్రోలర్లు తాము ఎంతటి నిఖార్సైన లౌకికవాదులో చాటుకొన్నారు.

వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరి కరీన్ జీన్‌పీరే కూడ కిర్బే ప్రకటనను పునరుద్ఘాటిస్తూ "మేము పత్రికా స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉన్నాం గనుకే గతవారం సంయుక్త పత్రికా గోష్టిని ఏర్పాటు చేశాం. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై బెదిరింపులను, వేధింపులను మేము ఖండిస్తున్నాం" అని

పేర్కొన్నారు.

మోడీ ఇచ్చిన సమాధానంతో బైడెన్ ఏకీభవిస్తున్నారా అని ఒక విలేకరి ఆ సందర్భంగా ప్రశ్నించగా అది ప్రధాని మోడీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్న. ఆ విషయంపై నేనిక్కడ చర్చించను. బైడెన్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉంది. అందుకనే పత్రికల వారు బైడెన్‌తో పాటు మోడీ చెప్పేది కూడా వింటే బావుంటుందని అనుకొన్నాం అని ఆమె వివరించారు.

కాగా ఆ సంయుక్త పత్రికా గోష్టికి మోడీని ఒప్పించ డానికి వైట్ హౌస్ అధికారులకు చాలా సహనం చూపాల్సి వచ్చిందట. సహనం అన్న మాటను వైట్ హౌస్ అధికారులు ఉపయోగించాల్సి వచ్చిందంటే వారు నిజంగానే ఎన్ని పాట్లు పడ్డారో పాపం. ఆ ప్రయత్నంలోనే ప్రశ్నల సంఖ్యపై పరిమితి విధించారు కూడా.

మోడీకి తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన "రెడ్ కార్పెట్" ఆహ్వానంపై 70 మంది అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు (ఎంపీలు) అభ్యంతరం చెప్పారు. ప్రధాని పర్యటన తర్వాత మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక ప్రకటన చేస్తూ మోడీ మార్కు ప్రజాస్వామ్యాన్ని ఎండగట్టారు.

వెంటనే మన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఒబామాపై విరుచుకు పడ్డారు. ఆఫ్ఘన్, ఇరాక్‌లపై బాంబుల వర్షం కురిపించిన ఒబామా మమల్ని ప్రశ్నిస్తారా అని మండిపడ్డారు. అలా మండిపడిన వారు ఆఫ్ఘన్, ఇరాక్‌లపై బాంబులు కురిపిస్తున్నప్పుడు ఏం చేశారు? ఒబామాను ఖండించారా? చంకలు గుద్దుకొన్నారా? ఒకసారి నిజం ఒప్పుకొని లెంపలేసుకొని ఉంటే బావుండేది.

ఈ వారంలో ముందుకు వచ్చిన మరో అంశాన్ని చూద్దాం... సుప్రీం కోర్టు రాజద్రోహ చట్టాన్ని అమలు చేయరాదని చెప్తూ ఆ చట్టాన్ని గత ఏడాది మే నెల నుండి పెండింగ్‌లో పెట్టింది. కాగా ఆ చట్టాన్ని రద్దు చేయరాదని 22వ లా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ అవస్థి ఐపిసి లోని సెక్షన్ 124ఎ ను అట్టిపెట్టాలని సూచించారు. దేశంలోని పరిస్థితులకు, ఉపా చట్టం, ఎన్ఎస్ఎ చట్టం సరిపోవని వలస పాలన కాలం నాటిదైనా సరే రాజద్రోహ చట్టాన్ని రద్దు చేయాల్సిన అవసరం లేదని అవస్థి చెప్పారు.

కాగా "లా కమిషన్ నివేదికను తాము వివరంగా పరిశీలించి నిర్ణయం తీసుకొంటామ"ని ప్రభుత్వం ప్రకటించింది. రాజద్రోహ చట్టం దుర్వినియోగం కాకుండా తాము కొన్ని చర్యలు సూచించినట్లు లా కమిషన్ చెబుతున్నా ఆ మార్పులు ప్రజలను మరింత ఇబ్బంది పెట్టేవేనని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు అంటున్నాయి.

లా కమిషన్ చైర్మన్ తన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచుతూ కాశ్మీర్ నుండి కేరళ దాకా, పంజాబ్ నుండి ఈశాన్య రాష్ట్రాల దాకా ఉన్న దేశ భద్రతను, సమైక్యతను కాపాడాలంటే రాజద్రోహ చట్టం అవసరం అని చెప్పారు. అంటే రాజ్యాంగంలోని ఫెడరల్ విలువలను అమలు చేయడం కన్నా, రాజద్రోహ చట్టం అనే కత్తిని మెడపై వేలాడదీసి కేంద్రం పరిపాలన చేయాలని లా కమిషన్ చెప్పినట్లయింది.

సుప్రీం కోర్టును కూడా మోడీ ప్రత్యర్థిగా చూస్తున్నట్లు కన్పిస్తుంది. 'మేము రాజ్యాంగానికి బద్దులమై పరిపాలన చేస్తాం' అని అమెరికన్ కాంగ్రెస్‌లో (పార్లమెంటులో) మోడీ ఎంత నాటకీయతతో చెప్పినప్పటికీ దేశంలోని దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను అడ్డగోలుగా వాడుకోవడమే మనకు కన్పిస్తుంది. ఆ ధోరణికి చట్టబద్ధత కల్పించడానికి లా కమిషన్ సిఫారసులు పనికొస్తాయి.

వరవరరావు లాంటి వారు రాజద్రోహం నేరం కింద అరెస్టు అయ్యారు. సంఘ సేవకుడు స్టాన్‌స్వామి ఆ నేరం కింద అరెస్టయి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జైల్లోనే చనిపోయారు.

ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోంది. రాజ్యాంగం ప్రకారం అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ రాష్ట్ర మంత్రివర్గం మాట వినాలని సుప్రీంకోర్టు చెప్తే దాన్ని తలకిందులు చేస్తూ కేంద్రం ఒక ఆర్డినెన్సు తెచ్చింది. ఢిల్లీ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తనకు పాదాక్రాంతం కావాలన్నదే మోడీ తపనగా కన్పిస్తుంది. అదీ మోడీ మార్కు ఫెడరలిజం.

మోడీ మత సామరస్యం గురించి అమెరికా కాంగ్రెస్ లో గొప్పలు చెప్పుకోగా, అదే సమయంలో ఇక్కడ ఉత్తరాఖండ్‌లో ఒక పట్టణం నుండి ముస్లింలను ఆసాంతం తరిమేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉత్తర కాశీ జిల్లాలోని పురోలా పట్టణం నుండి ముస్లింలను తరిమేయడానికి "దేవభూమి రక్ష అభియాన్" అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఉత్తర కాశీ హిందువుల పవిత్ర స్థలం కనుక అక్కడ ఇతరులు ఉండరాదని ఆ సంస్థ వాదననేది స్పష్టం గానే అర్థమవుతోంది. ఆ నేపథ్యంలో 15 ఏళ్ల హిందూ బాలికను ఎత్తుకెళ్లడానికి ఇద్దరు యువకులు ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. వెంటనే పట్టణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

ఫిర్యాదులో నిందితులుగా పేర్కొన్న ఉబైద్,

జితేంద్ర సైనీలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసిన తర్వాత కూడా దేవభూమి రక్ష అభియాన్ కార్యకర్తలు చాలా మంది ముస్లింలను పట్టణం నుండి బలవంతంగా పంపించేశారు.

82 ఏళ్ల ధరమ్ సింగ్ నేగి అనే లాయర్ తన షాపును కిరాయికి తీసుకొన్న ముస్లింలను ఖాళీ చేయించ బోనని గట్టిగా నిలబడ్డారు. ధరమ్ సింగ్ నేగి మెత్తబడితే ఆ పట్టణంలోని ముస్లింలందరూ వ్యాపారాలను ఎత్తేసుకొని వలసబాట పట్టాల్సిందే.

భారతదేశ పౌరులై ఉండి కూడా బర్మాను వదలి వచ్చిన రోహింగ్యాల్లాంటి బతుకును వారు గడప వలసి ఉంటుంది. ఇదేపాటి లౌకికవాదమో మన ప్రధానే చెప్పాలి.

ఇదిలా ఉండగా నిందితులైన వారి కుటుంబ సభ్యులు కావాలనే తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని, ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించిన పోలీసులకు ఫిర్యాదును ధృవపరిచే సమాచారం దొరకలేదని చెప్తున్నారు.

ఒకవేళ నిందితులపై ఫిర్యాదు నిజమేనని రుజువైనా ఎవరో ఒక ముస్లిం యువకుడు తప్పు చేశాడని ఒక పట్టణం నుండి ముస్లింలందరూ వెళ్లిపోవాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసం.

ఆ పట్టణంలోని ముస్లింలపై ఒత్తిడి ఏ స్థాయిలో ఉందంటే ఉత్తర కాశీ ప్రాంతపు బిజెపి మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మహ్మద్ జాహిద్ కూడా డెహ్రాడూన్‌కు పారిపోయాడు. దేశంలో తన పార్టీకి చెందిన వారి వల్లే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురవుతుండగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రధాని తమ లౌకిక, ప్రజాస్వామ్య విలువలపై చేసిన ప్రసంగాన్ని ఏమనాలో ప్రజలే చెప్పాలి.




# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. తెనాలిలోని స్థానిక కొత్తపేట పెన్షనర్స్ హాల్లో జూన్ 23న జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, తెలుగు సంస్కృత అకాడమీ చైర్పర్సన్ లక్ష్మీపార్వతులను ఫెడరేషన్ నాయకులు కలిశారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇవ్వాలని బీమా సౌకర్యం కల్పించాలని మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఫెడరేషన్ తరపున కొమ్మినేని లక్ష్మీపార్వతిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కనపర్తి రత్నాకర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మంచి కలపూడి రవికుమార్, డి కోటేశ్వరరావు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు అంబటి శ్యాంసాగర్, పుట్ల పున్నయ్య వేముల నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఎన్ సుబ్బారావు, కరేటి సాంబశివరావు ఇతర నాయకులు జి ప్రభాకరరావు, ఎస్ హెచ్ జహీర్, జి ప్రకాష్‌రావు, శామ్యూల్, సిహెచ్ చంద్రశేఖర్, ప్రేమ కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య

ఆళ్లగడ్డ: జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య అని , దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీడబ్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, కోశాధికారి నాగరాజు, తాలూకా గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు.. మహానంది మండల వార్త విలేకరి మధుపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జులై 17న ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మండల తాసిల్దార్ హరినాధరావుకు, పట్టణ సిఐ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద విలేకరులు శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు ఎంతవరకు సమంజసం అన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఖాశిం వలి, ప్యాపిలి ప్రసాద్, అక్షింతల శ్రీనివాసులు, అరుణ్, మహమ్మద్ హుస్సేన్, డిడి8 భాష, జనం దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఇండిపెండెంట్ జర్నలిస్ట్ తులసి చందు ప్రస్తావించిన ప్రశ్నలివే!

ఎందుకు నేను బీజేపీపైనే ఎక్కువ వీడియోలు చేస్తున్నాను? ముఖం చూపించలేని వాళ్లు, సొంత పేర్లు చెప్పుకోలేని ఫేక్ అకౌంట్స్ నుంచి ఘోరమైన కామెంట్స్,ఇన్ బాక్స్ మెసేజస్ వస్తున్నా నేను ఈ పని ఎందుకు చేస్తున్నాను? ఇండిపెండెంట్ జర్నలిస్టుగా చెప్పుకుంటూ ఎక్కువ వీడియోలు బీజేపీని ప్రశ్నిస్తూ ఎందుకు చేస్తున్నాను?

నేను చేసిన వీడియోలు మీరు చూశారా ఎంఐఎం బీజేపీ ఒక్కటే అని చాలా సార్లు చెప్పాను.బీజేపీని ఎందుకు వ్యతిరేకిస్తానో కూడా చెప్పాను.మతం పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారు అంటేనే ప్రజల్ని సమానంగా చూడట్లేదు అని అర్థం. బీజేపీ ఎంఐఎం రెండింటి డీఎన్ఏ ఒకటి. ఒకటి పెద్ద పార్టీ రెండోది తోకపార్టీ అంతే తేడా. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం కంటే ఏ దేశానికీ అత్యంత ప్రమాదకరమైన విషయం మరొకటి ఉండదు.రాజ్యాంగం సాక్షిగా పాలిస్తామని చెప్పి ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చి వచ్చినప్పట్నుంచి మెజారిటీ మతం వాళ్లను మైనారిటీ మతాలపైకి ఎగదోయడం కూడా విశాలమైన ఛాతీ ఉన్న రాజకీయాలేనా. వాజ్ పేయ్ ఇలా చెయ్యలేదే.

మత మార్పిడులు జరగకుండా హిందూ మతంలో కులాన్ని పాతరెయ్యొచ్చు.మరి కుల నిర్మూలనకు తీసుకున్న చర్యలేంటి? గిరిజన రాష్ట్రపతి, బహుజన ప్రధాని ఉన్న దేశంలో మత రాజకీయాలు ఎందుకు? ఒక్క రాష్ట్రంలో అయినా మతం పేరు చెప్పకుండా ఎందుకు గెలవలేకపోతున్నారు..?

అధికారంలో ఉన్నదే హిందూ పార్టీ యినప్పుడు.. 80 కోట్ల మంది హిందువుల్ని ఎవరు ఈ రోజు అభద్రత లోకి నెట్టేశారు? 75 ఏళ్లుగా లేని అభద్రత ఇప్పుడే వచ్చిందా. ఢిల్లీలో ఓ హిందు అమ్మాయిని ముస్లిం చంపేస్తే దాన్ని ఒక క్రైంగా చూడట్లేదు హిందువులపై దాడి అంటున్నారు.అదే హిందూ అమ్మాయిల్ని రోజూ వందల మందిని భర్తలూ, తండ్రులు, అన్నలూ, ప్రియుడు గుర్తు తెలియని వ్యక్తులు చంపేస్తోంటే ఎందుకు మాట్లాడరు?

దేశంలో ఉగ్రవాదం ఉండకూడదు.అలాగని మీ స్నేహితున్నో, నా పక్కింట్లో ఉన్న సాధారణ ముస్లింలనో దోషులుగా చూపవచ్చా?

ఇతర దేశాల్లో మనవాళ్లు ఉన్నారు,అక్కడొక హిందువు క్రైం చేస్తే మొత్తం అందరినీ ఒకే గాటన కడితే మనకు ఎలా ఉంటుంది?

ఇప్పుడు దేశంలో ఎక్కడ ఏం జరిగినా మతం కోణం ఎందుకు వస్తోంది? చివరికి బాలాసోర్లో రైలు ప్రమాదం జరిగితే పక్కన మసీదు వల్లే,ఆ రోజు శుక్రవారం కాబట్టి అనేది తెరపైకి వచ్చింది. తీరా చూస్తే అది మసీదు కాదు ఇస్కాన్ టెంపుల్.

తర్వాత స్టేషన్ మాస్టర్ ముస్లిం కావడం వల్లే ప్రమాదం అన్నారు తీరా చూస్తే ఆ స్టేషన్ మాస్టర్ మహంతి ఒక హిందువు. తర్వాత ఇప్పుడు ఇంజినీర్ అమీర్ అన్నారు.. ఇది కూడా తప్పుడు ప్రచారమే అని చివరికి రైల్వే డిపార్టెంట్ వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

అంటే ఒక ప్రమాదాన్ని ఇన్ని సార్లు మతం కోణంలో చూసి తప్పుడు ప్రచారాలు చేసి నాలుకు కరుచు కుంటున్నారు అంటే ఎంత ద్వేషం నింపేసి ఉండాలి సామాన్యుల బుర్రల్లోకి.

చిన్న పిల్లలు కూడా ఇవాళ మతం గురించి మాట్లాడుతున్నారు అంటే ఈ పరిస్థితిలోకి ఎవరు నెట్టేశారు అంటే కారణం ఎవరు? మతాల పేరుతో కొట్టుకుచావాలా భవిష్యత్తు తరాలు.ఇప్పటి ఈ విద్వేషం కాల్చేసేది మన పిల్లల్ని కాదా? సిరియా, ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ ఈ దేశాల వక్కనా మనకు స్థానం కావాల్సింది?

కుటుంబాల్లో,పిల్లల మనసుల్లో నాటుతున్న విష బీజాలు పెరిగి పెద్దయ్యాక ఎలాంటి ఫలితాలు ఇస్తాయో పాలకులు ఆలోచిస్తున్నారా?

ఇప్పటి విద్వేషం రేపు ఎన్ని ఓట్లు తెస్తుంది అనే దగ్గరే వాళ్ల ఆలోచనలు ఆగిపోతున్నాయ్.. మర్నాడు మరో ఎన్నిక.. ఇంతే కదా నడుస్తోంది.. !?

ఇప్పుడు మనకు కావాల్సింది అమెరికాతో చైనాతో పోటీ పడే భారతదేశం కాదు... హిందూరాష్ట్రంగా ప్రకటించడమే మనక్కావాలి?

పోనీ ఏమౌతుంది ప్రకటిస్తే.. ఏం మారుతుంది? విదేశాల్లో సెటిలైపోయిన ఒక్క నాయకుడి బిడ్డైనా తిరిగొచ్చేస్తుందా? ఒక్క సామాన్యుడి పరిస్థితి మారుతుందా..?

మహా అయితే పుస్తకాల్లో సిలబస్ మారిపోతుంది. ఇంగ్లీష్ మినిమం అయ్యి హిందీ,సంస్కృతం వస్తుంది. అదే జరిగిదే చిన్న చిన్న చదువులకోసం కూడా విదేశాల బాట పట్టరా? అదా మనక్కావాల్సింది?

రాను రాను మతాలు,కులాలు లేని భారతదేశాన్ని నిర్మించాలా లేదా ఒకర్నొకరు ద్వేషిస్తూ కొట్టుకునే దేశం కావాలా?

కేరళలో 32 వేల మంది అమ్మాయిలు ఐసిస్ లో చేరారా? మరి అన్ని మిస్సింగ్ కేసులు ఉండాలి కదా.. గుజరాత్ లో 40 వేల మంది అమ్మాయిలు మిస్ అయ్యారు. తెలంగాణలో ఏపీలో అన్ని రాష్ట్రాల్లో వేలాది మంది అమ్మాయిలు మిస్ అవుతున్నారు వీళ్లంతా

ఏమైపోతున్నట్లు?
కేరళలో 3 కేసుల్లో ఇప్పటిదాకా కేసులు ఫైల్ అయ్యాయి,తల్లిదండ్రులు బయటికొచ్చారు, బాధితులు ఉన్నారు.మరి మిగతా 31వేల 997 కేసులు ఏవీ..?
అంత మంది ఉగ్రవాద సంస్థల్లో చేరిపోతో ఎన్ని లక్షల మంది వాళ్ల తల్లిదండ్రులు, బంధువులు రోడ్లపైకి రావాలి.. వచ్చారా? మరి ఎందుకీ ప్రచారం?
ఆజాదీ కాశ్మీర్ సమస్య కాశ్మీర్లో ఉంది. కాశ్మీర్లో సాధారణ హిందువులు,సాధారణ ముస్లింలు కొట్టుకోవట్లేదు.. ఉగ్రవాదులు వేరు సాధారణ వ్యక్తులు వేరు. హిందువుల్లో క్రైస్తవుల్లో కూడా మతాన్ని అతిగా తీసుకొని ఇతరుల్ని ద్వేషించే వాళ్లు ఉంటారు.ఇది వ్యక్తుల సమస్య ఇక్కడికి రాజకీయం ఎందుకు తెస్తున్నారు..
సరే ఇదే బీజేపీ నార్త్ ఈస్ట్ లో క్రిస్టియన్ అనుకూల విధానాలు, హామీలు ప్రకటనలు చేసి గెలిచింది. అంటే ఎక్కడ ఏ మతం మెజారిటీ అయితే వాళ్లను పోలరైజ్ చేసి ఓట్లు దండుకొని అధాకరంలోకి రావడం ఇదేనా కావాల్సింది?
మణిపూర్ ఆహుతి అయిపోతోంటే.. కనీసం ప్రధాని నుంచి శాంతి ప్రకటన కూడా ఎందుకు రావట్లేదు? కరోనా కష్టకాలంలో టీవీల్లో కనిపించి చెప్పిన మాట కనీసం మన్ కీ బాత్ లో అయినా చెప్పొచ్చు కదా.. నేనున్నాను.. మీ సమస్య పరిష్కరిస్తాను అని.. ఎందుకు చెప్పట్లేదు?
చనిపోతున్న వాళ్లంతా మతం మారిన క్రైస్తవులే కాదు.. హిందువులూ చనిపోతున్నారు.. హిందువు లైన మెయిటీల ఆస్తులూ ధ్వంసమౌతున్నాయ్..
మరి హిందువు కోణంలో అయినా ఒక ప్రకటన చెయ్యాలి కదా కేంద్రం. పోనీ గిరిజన మహిళ అయిన రాష్ట్రపతితో అయిన ప్రకటింపజేయవచ్చు కదా.. ఇవేవీ ఎందుకు జరగట్లేదు.
నేను ఇది అడిగినా మీ దృష్టిలో దేశద్రోహి, హిందూ వ్యతిరేకి అయిపోతున్నాను. చేవ చచ్చిన కాంగ్రెస్ పార్టీని ఏమని అడుగుతాం ఈ దేశం గురించి..? అధికారంలో ఉన్న వాళ్లనే కదా అడగాలి..?
పోనీ దేశంలో ఉన్న మెజారిటీ మతానికి ఏం మేలు చేసినట్లు? ఏ సామాన్యుడినైనా పిలిచి మతం చూసి ఓటు వేశావు కదా.. నీకు జరిగిన 3 గొప్ప మేళ్లు చెప్పు అంటే ఏం చెప్తాడు?
పెట్రోల్ గ్యాస్ ధరలే కాదు.. టాక్స్ పరిధిలోకి రాని వస్తువులు ఎన్ని ఉన్నాయ్ ఇప్పుడు?
రైళ్లలో సామాన్యులు కిక్కిరిసి కూర్చునే జనరల్ బోగీలను నిలువునా కోసేస్తున్నారు.. వృద్ధులకుండే రిజర్వేషన్ పూర్తిగా ఎత్తేశారు. పెన్షన్ల నుంచి కూడా రకరకాల కోతలతో నేరుగా వసూళ్లు చేస్తున్నారు.
పరిశ్రమలు పెట్టక్కర్లేదు.. ఉన్న వాటిని సొంత ఆస్తిలా అమ్మేస్తున్నా అడగకూడదా? కనీసం ఒక పౌరురాలిగా అయినా అడిగే హక్కు ఉంటుంది కదా.. మీరు అడగరు.. నేను అడిగితే హిందూ వ్యతిరేకినా?
బీజేపీని అధికారంలోకి తెచ్చింది గుజరాత్ మోడల్ చూసేగానీ మతాన్ని చూసి కాదు. మతం పేరుతోనే అయితే అద్వానీని చూపించే వాళ్లు 2014లో. గుజరాత్ వెలిగిపోతోంది.. భారత్ కూడా వెలిగిపోవాలి అంటే మోదీ రావాలి అని..
మోదీ వచ్చారు నల్లధనం వచ్చిందా, నోట్ల రద్దు తర్వాత గుర్తించిన నల్లధనం ఏమీ లేదు.. ఏదైనా చేశారు అంటే మళ్లీ రెండు వేల నోట్లు రద్దు చెయ్యడం. మరి అకౌంట్లలో వేస్తాం అన్న రూ. 15 లక్షల మాటేంటి? ఇది ఎవరూ అడగకూడదు కదా..? అడిగితే దేశ ద్రోహి, ధర్మ ద్రోహి హిందూ వ్యతిరేకి.
జీఎస్టీ వల్ల కేంద్రానికి రెవెన్యూ పెరిగింది. కానీ పరిశ్రమలు మూతపడ్డాయి. చిన్న చిన్న వ్యాపారాలు నష్టాల్లోకి వెళ్లాయి. హొటల్లో ఇడ్లీ తిన్నా జీఎస్టీ వేస్తున్నారు..
ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తాం అన్నారు..ఏవీ ప్రతి ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయ్..
మన దేశంలో ఉండే సహజమైన అధిక జనాభా అనే పొటెన్షియాలిటీని బేస్ చేసుకొని, మనం చదువులకు ఇస్తున్న ప్రాముఖ్యతను క్యాష్ చేసుకునేందుకు చీప్ లేబర్ కోసం ఇక్కడికి పెద్ద పెద్ద కంపెనీలు వచ్చి ప్రైవేట్ జాబ్స్ పెరిగాయ్..
మరి ప్రభుత్వ ఉద్యోగాలేవీ..? మేము నిరుద్యోగులం అని 29 కోట్ల మంది ప్రభుత్వం దగ్గర నమోదు చేసుకున్నారు..? నమోదు చేసుకోని వాళ్లనూ కలిపితే..?
కొంత మంది పారిశ్రామిక వేత్తల్నే ప్రోత్సహించడం వల్ల మార్కెట్లో మోనోపలి పెరిగిపోయింది. ఇప్పుడు దేశం అంత భారీ స్థాయికి చేరుకున్న ఆ ఒకరిద్దరు పారిశ్రామిక వేత్తలకు ఏదైనా అయితే దేశ ఆర్థిక పరిస్థితి తలకిందులయ్యే స్థితికి ఎవరు కారణం?
గ్యాస్,పెట్రోల్ ధరల ప్రభావం ఎవరిపై ఎక్కువగా పడింది. గ్రామాల్లో మళ్లీ కట్టెపొయ్యిలు ఎందుకు పెరిగాయో మీరు ఊరెళ్లినప్పుడు అడగండి ఆడవాళ్లు చెప్తారు.
మీ ఫోన్ చెక్ చేసుకోండి మీకు బీజేపీ ఐటీ సెల్ నుంచి వండి వార్చిన మెసేజీలు మోడీ వల్ల దేశం వెలిగి పోతోంది అన్న మెసేజీలు, ఇతర మతాలపై ద్వేషం కలిగించే మెసేజీలు ఎన్ని వచ్చాయో చూసుకోండి.
కొత్తగా ఆఫీసులో చేరిన వాళ్లు ఇప్పుడు వాళ్ల క్వాలిఫికేషన్స్ గురించి చూడట్లేదు, పక్కవాడి ఐడియాలజీ ఏంటి, వాడి మతం ఏంటి అని

చూస్తున్నారు.

క్రిస్టియనో,ముస్లిమో అయితే కొందరు హిందువులు ద్వేషిస్తున్నారు. నుదుటున కుంకం బొట్టుపెట్టుకున్న ఫ్రెండును చూస్తే ముస్లిం లేదా క్రిస్టియన్ ఉలిక్కి పడుతున్నారు. మన ఫ్రెండ్స్ లో ఆ అభద్రతకు కారణం ఎవరు? అంత అవసరం ఏంటి?

పోనీ ఆలయాలకు ఏం చేశారు? అయోధ్యలోని రామమందిరమే కాదు అంతే విశిష్ఠత ఉన్న కడప జిల్లా ఒంటిమిట్ట రామాలయం ఉంది, భద్రాద్రి రాముల వారి ఆలయం ఉంది.. వాటికి ఏం చేశారు? ఏమీ లేదు.. ఒక్క టెంపుల్ చూపించి దేశంలోని మొత్తం దేవాలయాలను నిర్వీర్యం చేస్తున్నది ఎవరు?

ఈ రోజు అందరికంటే దయనీయ పరిస్థితి సగటు సామాన్య హిందువులది,గతంలో ప్రభుత్వాలపై కోపమొస్తే గట్టిగా రోడ్లపైకి వచ్చి నిలదీసే వాళ్లు. కానీ ఇప్పుడు ఎవరైనా కడుపుకాలి నోరెత్తితే.. హిందువై ఉండి హిందువుల్ని ప్రశ్నిస్తావా నువ్వు దేశద్రోహివీ, హిందూ ద్రోహివీ.. నీ మొగుడు/పెళ్లాం ముస్లిమా, నువ్వు కన్వర్టెడ్ క్రిస్టియనా అంటున్నారు..

సామాన్య యువత(బడా బాబుల పిల్లలు కాదు) మెదళ్లు ఈ రోజు గొప్ప భవిష్యత్తు గురించో, శాస్త్రీయ దృక్పథం వైపో లేవు.. కేవలం తాము నమ్మిన మతాన్ని తమను రెచ్చగొడుతున్న మతాన్ని డిఫెండ్ చేసే స్థాయికి పడిపోయాయి..

ఇన్ని కోట్ల మెదళ్లు మతం చుట్టూ ఉన్నప్పుడు... నా లాంటి ఒక్కరో ఇద్దరో ఇలా చేస్తున్న మతోన్మాద పార్టీలను ప్రశ్నిస్తే మీకు చాలా కష్టం కలుగుతోంది.

నాకు తెలుసు నాది ప్రమాదకరమైన ప్రయాణం.. ఎప్పుడో ఏ అమాయక యువకుడో నా మీద తను ప్రేమించే పార్టీ నింపిన విద్వేషాన్ని కత్తిగానో బుల్లెట్టుగానో మార్చి దాడి చేస్తాడని.. అలాగని కోట్లాది మంది యువత కళ్లముందు మతం మత్తులోకి జారుకుంటూ ఉంటే నేను చూస్తూ ఉండలేకనే నా పరిధిలో నేను చెప్పాల్సినవి చెప్తున్నాను.

మత విద్వేషాలు మాత్రమే ఏ దేశయువతకైనా అత్యంత ప్రమాదకరం అని నేను చెప్తున్నందుకు నన్ను ద్వేషిస్తున్నారు, బూతులు తిడుతున్నారు.. నా ఫోటోలు మార్ఫింగ్ చేస్తున్నారు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు.. కానివ్వండి..

నన్ను డిఫెండ్ చెయ్యడానికి ఏ పార్టీ ముందుకు రాదు నేను ఏ పార్టీ మద్దతుదారూ కాదు కాబట్టి.. ఏ కుల సంఘమూ రాదు.. నా కులమేంటో ఎవరికీ తెలీదు కాబట్టి.. ఏ గ్రూపూ నా కోసం నిలబడదు.. నాకు ప్రభుత్వం ఇచ్చే జర్నలిస్టు గుర్తింపు కార్డు సహా ఏ గుర్తింపూ లేదు కాబట్టి..

ఇలా ఒకరిద్దరికి నాకు తోచినప్పుడు వివరణ ఇవ్వడం కంటే ఇంకేమీ చెయ్యలేని అశక్తురాలిని.. ఏదో ఒక రోజు రాలిపోతాను, బలైపోతాను..

నా బిడ్డలకు, భర్తకూ అన్యాయం చేసిన దాన్నవుతాను.నేను తప్ప ఈ లోకంలో ఎవరూ లేని నా తల్లికి అన్యాయం చేసినదాన్నవుతాను. కానివ్వండి.. అలా అయ్యేలోపు కనీసం నా ఆవేదనను, ఏకాకిగొంతును రికార్డు చెయ్యనివ్వండి.

**– తులసి చందు, జూన్ 24,2023**

# ఈనాడు ప్రతినిధి దుర్గాప్రసాదుకు ఎంహెచ్ అవార్డు

మోటూరు హనుమంతరావు స్మారక అవార్డును సాధించిన ఈనాడు విలేకరి పుట్టపర్తిలో జరిగిన అవార్డుల బహూకరణ కార్యక్రమానికి అనివార్య కారణాల రీత్యా హాజరుకాలేకపోయారు. ఈనాడు స్టేట్ బ్యూరో ప్రతినిధి దుర్గాప్రసాదుకు ప్రజాశక్తి సాహితీ సంస్థ తరుపున మోటూరు హనుమంతరావు రాష్ట్రస్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డును బహూకరించారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డు నిర్వాహక కమిటీ సభ్యులు కె. గడ్డెన్న అవార్డు, జ్ఞాపికను దుర్గాప్రసాదుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. జులై 20వ తేదీనే బహూకరించాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల తరువాత అందజేశారు. రాయలసీమ ప్రాంతంలో కర్నూలు, అనంతపురం జిలాల్లో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి కోసం వలస వెళుతున్న నేపథ్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజల పడుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి 'ఊరు వలస పోతోంది' శీర్షికతో రాసిన కథనాన్ని ఉత్తమ కథనంగా ఎంహెచ్ అవార్డుల కమిటీ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పలువురు తోటి జర్నలిస్టులు దుర్గాప్రసాదును అభినందించారు. తన పుట్టినరోజునాడే ఉత్తమ జర్నలిస్టు అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందని దుర్గాప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనాడు స్టేట్ బ్యూరో చీఫ్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు షేక్ ఖాజావలీ, ప్రజాశక్తి బ్యూరోచీఫ్ వి. సురేష్ తదితరులు ఉన్నారు. ఎంహెచ్ అవార్డు బహూకరణ ప్రతి యేటా జర్నలిజంలో విశిష్టసేవలు అందించిన గ్రామీణ పాత్రికేయులకు మోటూరు హనుమంతరావు స్మాకర అవార్డులను ప్రదానం చేస్తున్నారు.

# ఉనికి కోల్పోయిన స్వతంత్ర జర్నలిజం




రాజకీయ జోక్యం కారణంగా స్వతంత్ర జర్నలిజం ఉనికి కోల్పోయిందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల గౌడ ఆందోళన వ్యక్తం చేశారు. మెజారిటీ మీడియా సంస్థలు ఏదో ఒక రాజకీయ పార్టీతోనో, భావజాలంతోనో పొత్తు పెట్టుకోవడమే ఇందుకు కారణం అన్నారు. పరిమిత సంఖ్యలోనే మీడియా సంస్థలో ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. పుట్టపర్తిలోని స్థానిక ఆర్పీ జానకి రామయ్య కళ్యాణమండపం వేదికగా కామ్రేడ్ మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాల గౌడ హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ గిరిజమ్మ, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ తులసీదాస్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు మీడియా పాత్ర అంశంపై ప్రసంగించారు. ద్వేషపూరిత ప్రసంగాలు, మతవిద్వేషాలు రోజురోజుకు పెరుతున్నాయని అన్నారు. కార్పొరేట్ శక్తుల

## సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల గౌడ

ప్రభావం మన సమాజంపై రోజురోజుకు పెరుగుతున్నదని, రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించాల్సిన సందర్భాల్లో అవేశకావేశాలకు లోనయి చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయన్నారు. విద్వేషం, అంతరాలు సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న వాతావరణం ఉన్నదని ఆ ధోరణి మార్చడానికి రాజకీయ పక్షాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక శక్తులు కృషిచేయాలన్నారు. ఇలాంటి అరాచకాలను పరమత సహనం పాటించే మన దేశంలో ఆపడం సవాలుగా మారిందన్నారు. స్త్రీ సమానత్వ అంశాన్ని ఆర్టికల్ 14 లో పొందుపరిచినప్పటికీ అన్ని రంగాల్లో సమానత్వం కల్పించడం రాజ్యాంగానికి అతి పెద్ద సవాలుగా మారిందన్నారు. జనాభాలో 50శాతం ఉన్న మహిళలకు పార్లమెంట్లో 25శాతం సీట్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా డజన్ల కొద్ది అనుభవజ్ఞులైన మహిళా న్యాయవాదులు, న్యాయ మూర్తులున్నా సుప్రీంకోర్టులో మాత్రం కేవలం ముగ్గురు మాత్రమే న్యాయ మూర్తులుగా ఉన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా జర్నలిస్టులు పనిచేస్తున్నారని అన్నారు. సమాజాభివృద్ధిలో వార్తాపత్రికలు కీలకంగా పని చేయడాన్ని అభినందించారు. ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిన మోటూరి హనుమంతరావు, బొమ్మారెడ్డి నేటి యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. ప్రతి పాత్రికేయుడు వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. జడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలను జర్నలిస్టులు కాపాడిన తీరును కొనియాడారు. అనంతరం స్మారక అవార్డును హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే బొమ్మారెడ్డి స్మారక అవార్డును బ్యూరో స్టాఫర్ కేటగిరీలో రాజమహేంద్రవరానికి చెందిన పాత్రికేయుడు బి శ్రీనివాసచారికి, మండల స్థాయి విలేకరుల కేటగిరీలో హిందూపురం, సింగరాయకొండలకు చెందిన విలేకరులు షబ్బీర్ రవికుమార్‌లకు అందజేశారు.

# అడుగడుగునా మీడియాపై అణచివేత

రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.ఇందులో వృత్తిపరమైన అడ్డంకులు సైతం ఎన్నో ఉన్నాయి. తెలంగాణ వచ్చిన తరువాత రకరకాల కారణాలతో దాదాపు 350 మందికిపైగా జర్నలిస్టులు చనిపోయినట్టు అంచనా. కాగా,గుర్తింపు కోసం ఇచ్చిన కార్డులు కూడా నేడు చెల్లకుండా పోతున్నాయి.అనధికారిక ఆంక్షల పేరుతో ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాకుండా అడ్డుకునే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ కొత్త సచివాలయంలోనూ అదే పరిస్థితి.ఆధార్‌కార్డు చూపాలంటున్నది. సమాచారాన్ని గుప్పిట్లో బిగిస్తున్నది.మీడియా అంటే ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధి.ఫోర్త్ ఎస్టేట్.రాజ్యాంగం కల్పించిన హక్కు. బాధ్యత కూడా.అయితే ఆ పాత్రను పోషించడానికి వీలైన వాతావరణం ప్రస్తుతం దేశంలోగానీ,రాష్ట్రంలోగానీ కనిపించడం లేదు. అది రోజురోజుకీ తగ్గిపోతున్నది. రానురానూ ప్రభుత్వాలకు,మీడియాకు మధ్య దూరం పెరుగుతున్నది.కాదు..కాదు కావాలనే పెంచుతున్నారు. ప్రభుత్వం గానీ,సమాజం గానీ మీడియాను అలక్ష్యం చేసినా,నిర్లక్ష్యం ప్రదర్శించినా అంతిమంగా నష్టపోయేది ప్రజలు,ప్రభుత్వాలే అనే సంగతిని గుర్తించాలి. దాన్ని అనుమతించకూడదు. కొన్నేండ్లుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మీడియాను టార్గెట్ చేస్తున్నాయి. పక్కలో బల్లెంగా పరిగణిస్తున్నాయి.ప్రజా సమస్యలను సమాజంతోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడాన్ని సహించలేక పోతున్నాయి. యాజమాన్యాలను లోబరుచుకుంటున్నాయి. జర్నలిస్టులు, ఉద్యోగులు,సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి.కనీస వేతనాలు ఏండ్ల తరబడి ఎండమావిగానే మిగిలాయి.

ప్రజల కోసమే పనిచేసిన ఎన్డీటీవీ లాంటి చానళ్లు,న్యూస్‌క్లిక్,మింట్ తదితర వెబ్ పోర్టర్లపై ఐటీ దాడులకు పాల్పడుతున్నాయి. కేసులు పెడుతున్నాయి. జర్నలిస్టుల్లో అభద్రతా భావాన్ని మరింత పెంచుతున్నాయి.ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.రాజ్యాంగంలోని కీలక వ్యవస్థల్లో నాలుగో స్తంభమే మీడియా. ప్రత్యేకంగా ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం పౌరులకు వాక్ స్వాతంత్ర్యం ఉంది.దాన్నే భావ ప్రకటనా స్వేచ్ఛ అంటున్నాం.అలాగే పత్రికా స్వేచ్ఛగా,మీడియా స్వేచ్ఛగా భావిస్తున్నాం. శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థల మాదిరిగానే మీడియా కూడా ఒకటి. ఎప్పుడైతే వ్యాపార వేత్తలు,పెట్టుబడిదారులు,కార్పొరేట్ శక్తులు ఈ రంగంలోకి ప్రవేశించి లాభాలను పోగేసుకుంటున్నాయి. పెట్టుబడి మూలంగా మీడియా విస్తృతి పెరిగింది.కాగా అందులో కీలక భూమిక పోషిస్తున్న జర్నలిస్టులకు మాత్రం అన్యాయమే జరుగుతున్నది.నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. సహజంగానే జర్నలిస్టులు,మీడియా అనుదినం జన స్వరంగా,ప్రతి అక్షరం ప్రజల పక్షాన రాయాలి.ప్రసారం చేయాలి.సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని పాలకుల డొల్లతనాన్ని బయట పెట్టాలి. సమాజంలో 90శాతంగా ఉన్న పేదలు,అణగారిన తరగతులకు అండగా ఉండటం 'కలం' కార్మికుల ప్రాథమిక విధి.మొత్తంగా బాధితుల పక్షానే మీడియా నిలబడాలి.వారికోసమే పనిచేయాలి. అందుకు భిన్నంగా గత తొమ్మిదేండ్లుగా దేశంలో,రాష్ట్రంలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి.బాధితుల సమస్యలను రాసే,ప్రసారం చేసే ప్రజామీడియా నేడు తగ్గిపోతున్నది.అందుకు పాలకులే ప్రధాన కారణం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైతం మీడియాపై గుర్రుగా ఉన్నాయి.ఉక్కుపాదం మోపుతున్నాయి.మేం చెప్పిందే రాయాలి..మా మాటే వేదం అన్న తరహాలో వ్యవహరిస్తున్నాయి. వ్యతిరేకంగా రాసిన ఎంతో మంది జర్నలిస్టులు,రచయితలను అంతమొందించే పనిలో అసాంఘిక శక్తులు ఉంటే,వాటికే ప్రభుత్వాలు వత్తాసు పలుకుతుండటం గమనార్హం. గౌరి లంకేశ్,కాల్బుర్గీ,దభోల్కర్,ఫన్సారే తదితర జర్నలిస్టులు,రచయితల కిరాతక హత్యలే ఇందుకు సాక్ష్యం.పత్రికా స్వేచ్ఛను అడగడుగునా అన్ని రకాలుగా అణచివేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మీడియా పరిమితులను ఎదుర్కొంటున్నది.తీవ్రమైన ఒత్తిడికి లోనవు తున్నది.దాని స్వేచ్ఛకు సంకెళ్లు వేసే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇది ఎంతమాత్రం క్షమించరానిది.సహించకూడనిది కూడా.అనుకూల మీడియాకే వాణిజ్య ప్రకటనలు ఇస్తూ,ప్రజల పక్షాన వార్తలు

రాసే,ప్రసారం చేసే పత్రికలు,ఛానళ్లకు మాత్రం నిరాకరిస్తున్నాయి. వీటిలోనూ వేలాది మంది జర్నలిస్టులు,ఉద్యోగులు పనిచేస్తున్నారనే సంగతిని ప్రభు త్వాలు విస్మరిస్తున్నాయి. తద్వారా సంబంధిత జర్నలిస్టుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి.తెలిసే ఇలా చేస్తే,ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదు. ఇదిలా వుంటే,రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.ఇందులో వృత్తిపరమైన అడ్డంకులు సైతం ఎన్నో ఉన్నాయి. తెలంగాణ వచ్చిన తరువాత రకరకాల కారణాలతో దాదాపు 350 మందికిపైగా జర్నలిస్టులు చనిపోయినట్టు అంచనా.కాగా,గుర్తింపు కోసం ఇచ్చిన కార్డులు కూడా నేడు చెల్లకుండా పోతున్నాయి. అనధికారిక ఆంక్షల పేరుతో ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాకుండా అడ్డుకునే పరిస్థితి ఏర్పడింది.తెలంగాణ కొత్త సచివాలయంలోనూ అదే పరిస్థితి.ఆధార్‌కార్డు చూపాలంటున్నది.
సమాచారాన్ని గుప్పిట్లో బిగిస్తున్నది.తమకు అవసరమనుకున్నప్పుడు లీక్‌లు ఇచ్చే సాంప్రదాయం తీసుకొచ్చింది.కరోనా లాక్‌డౌన్ జర్నలిస్టులు,మీడియా కష్టాలు మరింత పెంచింది. సమాజం స్థితిగతుల నిత్యం వార్తలు రాసే జర్నలిస్టులే అనేక కష్టాలతో కొట్టుమిట్టాడుతుండటం ఆందోళకరనం. ఆవేదనాభరితం. మీడియా ప్రజల కోసం పనిచేయాలన్నా,వాస్తవాలు రాయాలన్నా ప్రభుత్వాలు సహకరించాల్సిందే.లేదంటే ఇంతకుముందే చెప్పుకున్నట్టు తొలుత ప్రజలు,అంతిమంగా ప్రభుత్వానికే నష్టం.

**–బి.బసవపున్నయ్య**

# భారత్ చైనా మీడియా వార్

భారత చైనాల మధ్య మీడియా సంబంధాలు దెబ్బతింటున్నాయి. అందుకు ఇటీవల జరుగుతున్న సంఘటనలు ఉదాహరణగా చెప్పవచ్చు. సరిహద్దుల్లో కావాలని కయ్యానికి కాలు దువ్వే చైనా మీడియా సంబంధాల విషయంలో మరోసారి తన బుద్ధి చాటుకుంది. మీడియా ప్రతినిధులపై అప్రకటిత ఆంక్షలను ఆమలుచేస్తోంది. సరిహద్దుల్లో భారత్‌తో గిల్లికజ్జాలు పెట్టుకునే డ్రాగన్ ఈసారి మీడియాను లక్ష్యంగా చేసుకుంది. కొన్ని నెలల కిందట మన మీడియా ప్రతినిధులకు ముగ్గురు సహాయకులే ఉండాలంటే పరిమితి విధించిన బీజింగ్ ఇప్పుడు అక్కడ పనిచేస్తున్న ఏకైక భారతీయ జర్నలిస్టును జూన్ నెలాఖరులోగా వెళ్లిపొమ్మని ఆదేశించింది. కొన్ని రోజుల క్రితం జిన్హువా చైనా సెంట్రల్ టీవీ జర్నలిస్టుల వీసా పొడిగింపును భారత్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో మన జర్నలిస్టులకు సహాయకుల సంఖ్యపై పరిమితి పెట్టిన డ్రాగన్ వారిని తామే ఎంపిక చేసి ఇస్తామని ప్రకటించింది. ఇప్పుడు భారతీయ జర్నలిస్టులను వెళ్లిపోవాలని ఆదేశించింది. పైగా చైనా ఆదేశాలతో ఇండియా పి టి ఐ విలేఖరి త్వరలో వచ్చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఏడాది ప్రారంభం వరకు చైనాలో నలుగురు భారత జర్నలిస్టులు ఉండేవారు హిందుస్థాన్ టైమ్స్ జర్నలిస్టు గత వారాంతంలో వచ్చేశారు. ప్రసార భారతి, హిందూ పత్రిక జర్నలిస్టులకు ఏప్రిల్‌లో వీసాలు పునరుద్ధరించలేదు. పిటిఐ ప్రతినిధిని కూడా వెళ్లిపోవాలని కోరడంతో పొరుగు దేశంలో మన జర్నలిస్టులు ఎవరూ లేనట్లు అవుతోంది.



కాకినాడ జిల్లాలో ఇటీవల అనుకొని విధంగా ప్రమాదానికి గురై పక్కటెముకలు విరిగి బెడ్ రెస్ట్ తీసుకుంటున్న ఏపీడబ్ల్యుజేఎఫ్ పెద్దాపురం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఏలేశ్వరం మండల అధ్యక్షుడు పట్నాయక్‌ను కలసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.కె మున్ని, ఎండి అధికార్, ప్రతిపాడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శిడగం మాధవ, రామ్, గంగా ప్రసాద్ ఇమ్రాన్

# పాత్రికేయుల రక్త ధాతృత్వం




రక్తదాన ప్రాముఖ్యత తెలిపేందుకు రక్తదాతలను అభినందించేందుకు మీడియా అకాడమీ తన వంతు బాధ్యతను నిర్వహిస్తుందని సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సి ఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదానం చేసిన పాత్రికేయులు, ఇతరుల రంగాల వ్యక్తులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణదానం చేస్తున్నట్లే అని స్వచ్ఛంద రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. సామాజిక స్పృహతో అత్యంత విలువైన రక్తాన్ని ఇచ్చి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న అందరూ అభినందనీయులే అని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఒకేరోజు 35 వేల యూనిట్లు రక్తదానం చేసిన వారందరినీ ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్వచ్ఛంద రక్తదాతలను గుర్తిస్తూ వారి ద్వారా సేకరించిన రక్తాన్ని పేదలకు ఆపదలో ఉన్నవారికి ఉచితంగా అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీని గౌరవించడం అంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లే అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ శాఖ కోఆర్డినేటర్ బిబిఎస్ కుమార్ విజయవాడ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ టివి రమణ రావులను కొమ్మినేని శాలువాతో సత్కరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధికి కీలకమైన విద్య వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ శాఖ బ్లడ్ బ్యాంక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బివిఎస్ కుమార్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ద్వారా ఒకరి ప్రాణం కాపాడవచ్చు అన్నది పాతకాలపు నినాదం అన్నారు. ప్రస్తుతం ఒకరి రక్తం మూడు ప్రాణాలు కాపాడడం జరుగుతుందన్నారు. అత్యాధునిక బ్లడ్ బ్యాంకులు కలిగిన రెడ్ క్రాస్ సొసైటీ సేకరించిన రక్తాన్ని ఎర్ర రక్త కణాలు, ప్లాస్మా, ప్లేట్లెట్ అనే మూడు భాగాలుగా విభజించి భద్రవరుస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న వారితో ఆయన రక్త దాన ప్రతిజ్ఞ చేయించారు. విజయవాడ బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి టీవీ రమణారావు మాట్లాడుతూ 2023 సంవత్సర రక్తదాత దినోత్సవం పురస్కరించుకొని ప్రపంచ ఆరోగ్య సంస్థ రక్తాన్ని ఇవ్వండి ప్లాస్మా దానం చేయండి జీవితాన్ని పంచుకోండి అనే నినాదాలు ఇచ్చిందన్నారు. వైద్యరంగంలో ఆధునిక పరిశోధనలు గుండె మార్పిడి సహా వివిధ అవయువాల మార్పిడి విజయవంతంగా చేస్తున్న కృత్రిమ రక్తాన్ని కనుగొనలేకపోయిందన్నారు. అందువల్లే రక్తదానం అత్యంత విలువైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు మాట్లాడుతూ సమాజంలో రక్తదానం అవయవ దానం వంటి అంశాలపై చైతన్యం పెరిగిందన్నారు. అందుకు దోహదపడిన రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలు దాతలు అభినందనీయులు అన్నారు. పలువురు పాత్రికేయులు రక్తదానం చేస్తూ సమాజ సేవ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాము రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించిన సంగతి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన పాత్రికేయులు సింహాద్రి కృష్ణ ప్రసాద్, నాగాయలంక సాక్షి మురళీకృష్ణ, తిరుమణి మచిలీపట్నం, వార్త గరికపాటి విజయకుమార్, విజయవాడ ప్రజాశక్తి కిరణ్ కుమార్ రెడ్డి సాక్షిలను చైర్మన్ సన్మానించారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన వ్యాపారులు కే అరుణ్ కుమార్ గుంటూరు, గాజుల రోహిత్ తాడేపల్లి, కెవిపి సుధీర్ విజయవాడ. వ్యవసాయదారులు పరుచూరి చినబాబు అవనిగడ్డ, స్వయం ఉపాధి రంగంలో ఉన్న మాచర్ల రామకృష్ణ గుడివాడ, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఎం రమేష్, విజయవాడ జిల్లా కోర్టులో పనిచేస్తున్న బి వంశీ కాంత్ రెడ్డి గుంటూరులను చైర్మన్ సత్కరించారు. సి ఆర్ మీడియా అకాడమీ సెక్రటరీ ఎం బాల గంగాధర తిలక్, ఓఎస్డి జీవన్‌కుమార్, ఏవో ఎంఎస్ఎస్ మూర్తి, కంటెంట్ ఎడిటర్ కలమంద శరత్ బాబు పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో ఇళ్లస్థలాలకు ఎమ్మెల్యే హామీ



ఎమ్మిగనూరు నియోజవర్గ ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు ఇంటి స్థలాలు కోరుతూ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని స్వగృహంలో కలిసి వినతి పత్రాన్ని అందజేసారు. ఫెడరేషన్ అధ్యక్షులు షబ్బీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విలేఖరి అక్రిటేషన్ కార్డ్, ప్రైవేట్ పాఠశాలలో విలేఖరుల పిల్లలకు ఉచిత విద్య, నియోజకవర్గం మూడు మండలాల్లో సంస్థ అందించిన ఐడి కార్డ్ ఉండే ప్రతి విలేఖరికి ఇంటి స్థలాలు అందించాలని ముఖ్యంగా నియోజవర్గంలో విలేకరుల కోసం ప్రెస్ క్లబ్ కోరగా పై విషయాలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రెస్ క్లబ్‌కు సంబంధించి హామీ ఇచ్చి త్వరలో క్లబ్ ఏర్పాటుకు తగిన సహాయం చేస్తానన్నారు. ఇంటి స్థలాల విషయంలో ఆలోచన చేస్తానని జర్నలిస్టులకు టిడ్కో ఇళ్ళలను అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు షబ్బీర్, గౌరవ అధ్యక్షులు దేవేంద్ర మూర్తి, ఉపాధ్యక్షులు వెంకటేష్, కోశాధికారి ఎం బేగ్, ఛానల్ ఎడిటర్ గౌస్, ఇలియాస్, నర్సన్నా, సురేంద్ర, ప్రేమ్, మురళి, విజయ్, శేఖర్, రాజు, నరసింహులు తదితర విలేకరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు నాగయ్య మృతి



కర్నూలు జిల్లా కృష్ణగిరి మండల సీనియర్ పాత్రికేయుడు నాగయ్య(57) జులై 17న గుండెనొప్పికి గురై కన్నుమూశాడు. వెల్దుర్తి రాణితోటలో నివాసముంటున్న నాగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నాగయ్యకు మూడు నెలల క్రితం ఆరోగ్యశ్రీ ద్వారా స్టంట్ వేయించుకుని కోలుకుని తిరిగి పాత్రికేయ విధులు నిర్వహించేవాడు. రాత్రి భోజనం చేసిన తర్వాత గుండెనొప్పికి గురైన నాగయ్యను కర్నూలు ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలలో 30ఏళ్లుగా విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికలలో పనిచేసిన నాగయ్య ప్రస్తుతం కృష్ణగిరి మండల ఆంధ్ర అక్షర దినపత్రిక విలేకరిగా సేవలందిస్తున్నాడు. నాగయ్య మరణవార్త తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఫారిన్లో ఉన్న కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి మృత దేహానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయమందించాడు. కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, కృష్ణగిరి టీడీపీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేఈ జయన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్రి శ్రీరాములు, గురుస్వామి, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నవీన్ మాదిగ, కృష్ణగిరి మండలం వివిధ పార్టీలకు చెందిన మండల, గ్రామ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మృతుడికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆంధ్ర అక్షర ఏపీ బ్యూరో డోన్ అచారి, వెల్దుర్తి, కృష్ణగిరి, డోన్ మండలాల పాత్రికేయులు మృతునికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృదుస్వభావి, మంచివాడు, సమాజ సేవలో నిమగ్నమైన పాత్రికేయుడిని కోల్పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.




# జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాటమే మార్గం

## పోలవరం నియోజకవర్గ ఫెడరేషన్ సమావేశం

జర్నలిస్టుల హక్కుల సాధనకు జర్నలిస్టులు అందరూ ఐక్యతతో పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు ఫెడరేషన్ సమావేశంలో జర్నలిస్టులను కోరారు. పోలవరం మండలంలోని స్థానిక కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఉన్న ఎస్.ఎస్.ఎస్. కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం పోలవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర బాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పూనెం చిన్న బుచ్చన్నదొర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు మాట్లాడుతూ వృత్తిపరంగా ఎదురవుతున్న అన్ని సమస్యలను చాకచక్యంగా అధిగమిస్తూ ముందుకు సాగాలని అన్నారు. అక్రిడేషన్ల విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తుందని అన్నారు. చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా అన్ని పత్రికల జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులు హెల్త్ స్కీముల్లో చేరి కుటుంబ ఆరోగ్య భద్రత కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి అంశాలకు దోహదపడుతున్న జర్నలిస్టుల సేవలు ప్రతి ఒక్కరూ గుర్తించేలా ప్రసార విధానాలలో మార్పులు తీసుకురావాలని అన్నారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అభివృద్ధికి నియోజకవర్గం కమిటీ ఏర్పాటుకు నిరంతరం కృషి చేసిన కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ సయ్యద్ జబ్బీర్, కో–ఆర్డినేషన్ సభ్యులు కే.సోమ శేఖర్ లను సూర్య పత్రిక మేనేజర్ వనుమర్తి రామును



అభినందించారు. సమావేశంలో ఎం.పి.పి. సుంకర వెంకటరెడ్డి, పోలవరం మండల జడ్.పి.టి.సి. కలుం హేమకుమారి, మండల వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు కొణతాల ప్రసాద్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్, జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి వీరవెంకట సత్యనారాయణ, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు, బిజెపి మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు పలువురు రాజకీయ నేతలు ప్రసంగించారు. పోలవరం ప్రెస్ క్లబ్ సభ్యులు పోలవరం అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరువాత పోలవరంలో స్థానికంగా ఉన్న ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో ఉంటున్నారని, పోలవరం టూరిజం ప్రాంతంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చారని కానీ వేరే చోటుకు మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని అలా చేయకుండా పోలవరం ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తే వలసలు ఆగుతాయని, ఈ విషయంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సహకరించి వార్తలు వ్రాయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్



ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కే ఎస్ ఎస్ శంకర్, సీనియర్ జర్నలిస్ట్ అక్రిడేషన్ కమిటీ మెంబర్ కె.బాలశౌరి, బిసిఎన్ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కె. షకీర్ బాజ్జి ప్రభృతులు ప్రసంగించారు. జర్నలిస్టుల ఫెడరేషన్ ఏర్పడి నేటికీ దాని అభివృద్ధికి సహకరించిన విధానం అభివృద్ధి చెందిన పద్ధతుల గురించి రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ ఎస్ శంకర్ మాట్లాడగా ఏ ప్రభుత్వం వచ్చినా జర్నలిస్టులకు సరైన సహకారం అందించటం లేదంటూ సీనియర్ జర్నలిస్ట్ కె.బాలశౌరి మాట్లాడగా కలిసి ఉంటే కలదు సుఖం జర్నలిస్ట్ అంతా ఐక్యతగా ఉండాలని, కొత్తవారిని స్వాగతించాలని, చిన్న పత్రికలు పెద్ద పత్రికలు తారతమ్యం లేకుండా అంతా ఐక్యతతో ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ కె ఎస్ బాజ్జి మాట్లాడారు. వీరితోపాటు వేదికపై సూర్య పత్రిక మేనేజర్ పసుమర్తి రాము, కో-ఆర్డినేషన్ సభ్యులు కే.సోమ శేఖర్, ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు కే.చిన్నారావు, కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ సయ్యద్ జబ్బీర్, అనన్య సినిమా డైరెక్టర్ ప్రసాద్ రాజు, పోలవరం మండల ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ తులసి వెంకట్రావు, వేదికపై ఆసీనులైయారు. పోలవరం మండల సీనియర్ జర్నలిస్ట్ విశ్రాంతి విలేకరి ఎలిపే జయకర్‌కు శాలువా కప్పి మెమెంటో అందించి ఘనంగా సన్మానం నిర్వహించారు. అనంతరం వేదిక అలంకరించిన జర్నలిస్టులకు రాజకీయ నాయకులకు శాలువాలు కప్పి మెమెంటోలు పోలవరం ప్రెస్ క్లబ్ సభ్యులు అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. వారిని జిల్లా ఫెడరేషన్ సభ్యులు రాష్ట్ర నాయకులు కార్యదర్శి అభినందించారు. జిల్లాలో నియోజక వర్గాలవారీగా ఇంత పెద్ద ప్రెస్ క్లబ్ పోలవరంలో ఏర్పడిందని వారందరినీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కందుల రాంబాబు, జాయింట్ సెక్రెటరీ దొడ్డి సుధాకర్‌రాజు, కోశాధికారి తాళ్లపూడి లక్ష్మణరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం కార్యదర్శి పూనెం చిన్న బుచ్చన్న దొర, క్రమశిక్షణ కమిటీ సభ్యులు కుంజం రాంబాబు, జల్లేపల్లి వెంకట చిరంజీవి, కార్యవర్గ సభ్యులు సిద్దే రామారావు, షేక్ సైదా, కనమర్లపూడి నాగేశ్వరరావు, పెరుమజ్జి శ్రీనివాస్, పీతల అర్జున్, జయవరపు ఆదిశేషు, వెంకటేశ్వరరావు, అయినపర్తి బుజ్జి, కొణతాల సురేష్, అమృత రామకృష్ణ, జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర, భూపతి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విలేకరిపై ఎస్సీ ఎస్టీ కేసు కొట్టివేత

నందిగామకు చెందిన విలేకరిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో నేరారోపణ రుజువు కాకపోవటంతో కేసు కొట్టివేస్తూ కృష్ణాజిల్లా పదవ ఆదనపు జిల్లా జడ్జి ఎ.నరసింహమూర్తి తీర్పు చెప్పారు. 2019 మార్చి 17వ తారీఖున నందిగామ పంచాయతీ కార్యాలయంలో నందిగామ డ్వాక్రా గ్రూపు టౌన్ లెవెల్ ఫెడరేషన్ సెక్రటరీపై కులం పేరుతో దూషించి అవమానించి దౌర్జన్యం చేశాడనే ఆరోపణపై నందిగామకు చెందిన విలేఖరి తాడేపల్లి రవిపై నందిగామ డిఎస్పి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై జరిగిన కేసు విచారణలో నేరారోపణకు తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో విలేకరి తరపున లంకిశెట్టి బాలాజీ, కమ్మిలి విజయకుమార్ న్యాయవాదులుగా వ్యవహరించారు.



## గోపరాజు మల్లపరాజు ఆకస్మిక మృతి

ఈనాడు దినపత్రికలో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ పాత్రికేయులు గోపరాజు మల్లప్ప రాజు (58) హైదరాబాద్ చైతన్యపురిలోని స్వగృహంలో జూన్ 15వ తేదీ మృతి చెందారు. పలనాడు జిల్లా గురజాలకు సమీపంలోని గంగవరం గ్రామానికి చెందిన మల్లపరాజు న్యాయ శాస్త్రం అభ్యసించిన తర్వాత ఈనాడులో 1989లో తన పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. మూడు దశాబ్దాలు పైగా ఈనాడు సంస్థలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి, హైదరాబాదులోని ఈనాడు కార్యాలయాల్లో పనిచేసి గత ఏడాది పదవీ విరమణ చేశారు. జూన్ 14వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో గుండెదడగా ఉందని మల్లపు రాజు తన కుమారుడు రాజేంద్రకి చెప్పి మాత్ర వేసుకొని నిద్రపోయారు. నిద్రలోనే మరణించారని ఉదయం కుటుంబ సభ్యులకు తెలిసింది. మల్లపు రాజుకు ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎంఎ రవూఫ్ సంతాపం వ్యక్తం చేశారు.

# జర్నలిస్ట్ సంజయ్ ఆత్మహత్య



మోజో టీవి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గా పని చేసి ఎందరో జర్నలిస్టులను తయారుచేసిన సంచలన జర్నలిస్ట్ సంజయ్ కుమార్ సింగ్ తన ఛాంబర్‌లో ఉరి వేసుకుని చనిపోయారు. ఇండియా టీవిలో అనేక సంచలనాత్మక స్టోరీలు అందించిన జర్నలిస్ట్ ఆత్మహత్య చేసుకుని తిరిగి రాని లోకాలకు వెళ్ళిపోయాడు.

**“ఇది నా కల**
**పరుగెత్తడానికి సాయ శక్తులా**
**ప్రయత్నించాను**
**ఇప్పుడు పరుగెత్తే శక్తి లేకుండా**
**పోయింది**
**నాలో ధైర్యం పూర్తిగా**
**చచ్చిపోయింది**
**ఇక ఉంటాను”**

ఇది సంజయ్ టేబుల్ పై దొరికిన చివరి ఉత్తరం!

సంజయ్ ఒక విలక్షణ జర్నలిస్ట్! అతను బీహార్ రాష్ట్రానికి చెందినవాడు. ఇండియా టీవిలో ఢిల్లీలో పనిచేసిన కాలంలో గొప్ప జర్నలిస్ట్‌గా గుర్తింపు పొందాడు. ఉన్నత విలువలు కలిగిన పాత్రికేయుడు. అతడి పనితీరు గమనించిన జర్నలిస్ట్ రవిప్రకాష్ హైదరాబాద్ ఆహ్వానించాడు. మోజో టీవి పగ్గాలు అప్పగించాడు. మోజో మూత పడింది. అతను తిరిగి వెళ్లలేకపోయాడు. హైదరాబాద్‌లోనే ఉండి పోయాడు. ఇంతలో భార్యకు బ్రెస్ట్ క్యాన్సర్. సరైన సాయం అందలేదు. చేతనైనంత మేరకు అప్పుడు చేశాడు. అన్నిరకాల సమస్యలతో మానసికంగా కుంగిపోయాడు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడాడు. అటువంటి పరిస్థితుల్లో ఇద్దరు ఇన్వెస్టర్స్ ముందుకు రావడంతో ఆఫీస్ ప్రారంభించి యూ ట్యూబ్ ఛానల్‌కు శ్రీకారం చుట్టాడు. అప్పులిచ్చినవారి ఒత్తిడి పెరిగిపోయింది. యూ ట్యూబ్ ఛానల్‌పై దృష్టి పెట్టడం లేదని భావించిన ఇన్వెస్టర్లు ఆర్థిక తోడ్పాటు ఆపేశారు. ఆ స్థితిలో మార్గాంతరం కనిపించక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంజయ్ రాజకీయ వ్యూహాలు ఎత్తుగడలతో మంచి కథనాలు అందించడంలో నేర్పరి. కుటుంబ బాధ్యతలు అంటే భయం. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడటంలో విఫలమయ్యాడు. మంచి జర్నలిస్ట్ జీవితం విషాదంగా ముగిసిపోవడం బాధాకరం. విచారకరం.



# జర్నలిస్టు ఉద్యమ నాయకుడు అంబటి ఆంజనేయులు కన్నుమూత

జర్నలిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన నాయకుడు అంబటి ఆంజనేయులు విజయవాడలో మరణించారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారు అంబటి ఆంజనేయులు విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జూన్ 25వ తేదీ కన్నుమూశారు. అంబటి ఆంజనేయులుకి స్వల్ప గుండె నొప్పి రావడంతో విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. నాలుగు రోజులు చికిత్స తీసుకున్న ఆయనకు జూన్ 25వ తేదీ తెల్లవారుజామున మరోసారి గుండెపోటు వచ్చిన కొద్దిసేపటికే కన్నుమూశారు. గడచిన 40 సంవత్సరాలకు పైగా జర్నలిస్టుల ఉద్యమంలో అంబటి ఆంజనేయులు చురుకైన పాత్ర పోషించారు. ఆంధ్రప్రభ -ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపులో ప్లాంట్ లెవల్ నాయకునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. జర్నలిస్టుల సమస్యలతో పాటు నాన్ జర్నలిస్టులను సంఘటితం చేయడంలో తన వంతు కృషి సాగించారు. ఆ సమయంలో సంస్థలోని ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేశారు. ప్లాంట్ లెవల్ సంఘాల్లో పనిచేసే సమయంలో అన్ని వర్గాల వారికి కలుపుకొని వెళ్లడానికి ప్రయత్నం చేసేవారు. విజయవాడ కేంద్రంగా జర్నలిస్టు ఉద్యమాన్ని నిర్వహించడంలో తనదైన ముద్ర వేశారు. యూనియన్‌లో అధ్యక్షునిగా, ప్రధానకార్యదర్శిగా మొత్తం నాలుగుసార్లు బాధ్యతలు నిర్వహించారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ఎన్ని ఇబ్బందులు, సమస్యలు ఎదురైనప్పటికీ యూనియన్ ప్రతినిధిగా బాధ్యత నిర్వర్తించారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే విజయవాడలో ఉన్న ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్.వెంకటరావు అందుబాటులో ఉన్న జిల్లా నాయకులతో కలిసి వెళ్లి నివాళులర్పించారు. అంబటి ఆంజనేయులు మృతికి నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్లు సంయుక్తంగా సంతాపం వ్యక్తం చేశాయి.

## ప్రముఖుల సంతాపం

జర్నలిస్టు ఉద్యమ నాయకుడు అంబటి ఆంజనేయులు మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు. విజయవాడ కేంద్రంగా అంబటి ఆంజనేయులు కార్యకలాపాలు సాగించిన కారణంగా నగరంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులకు ఆయన చిరపరిచితులు. ఆయన మృతికి వివిధ సంఘాల నాయకులు తమ సంతాపాన్ని తెలియజేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.



విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటను వేస్తూ.. వారి చదువుల భారాన్ని తన భుజాలకెత్తుకున్న జగనన్న ప్రభుత్వం..

వరుసగా నాలుగో ఏడాది.. | ... 2023-24 విద్యా సంవత్సరానికి

# జగనన్న విద్యా కానుక

...బడికెళ్ళడం ఇక వేడుక!!



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న **43,10,165** మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ. **1,042.53** కోట్ల ఖర్చుతో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ.. 12 జూన్, 2023న పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో లాంఛనంగా ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

ప్రతి విద్యార్థికి ఉచితంగా బైలింగువల్ పాఠ్య పుస్తకాలు ( ఒక పేజీలో ఇంగ్లీష్, మరో పేజీలో తెలుగులో పాఠ్యాంశాలు), నోట్‌బుక్‌లు, వర్క్ బుక్‌లు, 3 జతల యూనిఫామ్ క్లాత్ కుట్టుకూలితో సహా, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగు తో పాటు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ (6-10 తరగతి పిల్లలకు), పిక్టోరియల్ డిక్షనరీ (1-5 తరగతి పిల్లలకు) తో కూడిన జగనన్న విద్యాకానుక కిట్..

## బడులు తెరిచిన తొలిరోజే అందజేత..

"జగనన్న విద్యాకానుక" కిట్‌కు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (QCI) తో సహా 4 దశల్లో నాణ్యతా పరీక్షలు..

ప్రతి విద్యార్థికీ దాదాపు రూ 2,400ల విలువైన జగనన్న విద్యా కానుక

| సంవత్సరం | వ్యయం (రూ. కోట్లలో) |
|---|---|
| 2020-21 | 648.10 |
| 2021-22 | 789.21 |
| 2022-23 | 886.69 |
| 2023-24 | 1,042.53 |

ఇప్పటివరకు జగనన్న విద్యాకానుక పై చేసిన మొత్తం వ్యయం.. **3,366.53**

గత ప్రభుత్వంలో స్కూల్స్ తెరిచి 6-7 నెలలైనప్పటికీ యూనిఫామ్‌ల సంగతి దేవుడెరుగు, కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేని దుస్థితి.. ఇక ఇతర వస్తువుల ఊసే లేదు..

ఆ పరిస్థితిని సమూలంగా మారుస్తూ జగనన్న ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన రోజే 10 వస్తువులతో కూడిన "జగనన్న విద్యా కానుక" కిట్ అందజేత..








## కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ బడులతో పోటీపడేలా.. మన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా..

రాబోయే రోజుల్లో ప్రతి బడిలో ఇంగ్లీషు మీడియంతో సీబీఎస్ఈ సిలబస్ తీసుకువస్తూ.. డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలు బోధించే దిశగా తొలిదశ "మనబడి నాడు నేడు"లో అభివృద్ధి పరిచిన 6 నుండి 10వ తరగతి వరకు ఉన్న 30 వేల హైస్కూలుకు క్లాస్ రూములలో బైజూస్ కంటెంట్ తో కూడిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ తద్వారా సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన.. ఇంగ్లీష్ ల్యాబ్స్ ఏర్పాటు.. 1-5 వరకు ప్రతి స్కూల్లో ఉండేలా 10 వేల స్మార్ట్ టీవీలు కూడా ఏర్పాటు దిశగా అడుగులు..

మొదటిదశ "మనబడి నాడు నేడు"లో పనులు పూర్తయిన 15,715 స్కూళ్లలో ఈ ఏడాది జూలై 12 నాటికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (IFP) ఏర్పాటు పూర్తి.. రెండో దశలో భాగంగా 22,344 స్కూళ్లలో ఈ ఏడాది డిసెంబర్ 21 నాటికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు పూర్తి.. ఇక మిగిలిన స్కూళ్లకు మూడోదశలో ఐఎఫ్‌పీలు..

8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్ తో కూడిన ఉచిత ట్యాబ్‌లు.. 4 నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా బైజూస్ కంటెంట్.. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా బైజూస్ కంటెంట్.. బీఎస్ఎన్ఎల్, ఏపీ ఫైబర్ నెట్ ద్వారా 45,000 పాఠశాలల్లో ఇంటర్ నెట్ అందించేందుకు చర్యలు..

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ లో నైపుణ్యం సాధించేలా ఈ ఏడాది నుండే ప్రతి స్కూల్లో దీన్ని ప్రవేశపెడుతూ తర్ఫీదు ఇస్తూ టోఫెల్ ప్రైమరీ, టోఫెల్ జూనియర్ పరీక్షలు కూడా నిర్వహించి ఆ అమెరికన్ సర్టిఫికెట్ అందజేత.. అమెరికన్ సంస్థ ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) తో ఒప్పందం...

## తేడా గమనించండి !!

| ఇది కేవలం విద్యా రంగంలో సంస్కరణలపై మాత్రమే జగనన్న ప్రభుత్వం ఈ 4 ఏళ్లలో చేసిన వ్యయం... | | | ఇదీ గత ప్రభుత్వ 5 ఏళ్ళలో విద్యా రంగ దుస్థితి.. |
|---|---|---|---|
| **పథకం పేరు** | **లబ్ధిదారుల సంఖ్య** | **అందించిన మొత్తం రూ. కోట్లలో** | **పథకం వివరాలు** |
| జగనన్న అమ్మ ఒడి (పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా రూ. 15,000) | 44,48,865 | 19,674.34 | లేదు |
| జగనన్న విద్యా కానుక (యూనిఫామ్స్, బైలింగువల్ టెక్ట్స్ బుక్స్, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ, బూట్లు, సాక్సులు, బెల్ట్ వంటి వస్తువులతో కూడిన జగనన్న కిట్, స్కూల్స్ తెరిచిన తొలి రోజే అందజేత..) | 47,40,421 | 3,366.53 | స్కూల్స్ తెరిచిన 6-7 నెలలకు కూడా యూనిఫాం సంగతి దేవుడెరుగు కనీసం టెక్ట్స్ బుక్స్ కూడా అందించలేని దుస్థితి.. అందించినవి కూడా అరకొరగా కొన్ని మందికే.. ఇతర వస్తువుల ఊసే లేదు.. |
| జగనన్న గోరు ముద్ద (ప్రతి రోజూ మెనూ మార్చి మెరుగైన, నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం..) | 43,26,782 | 3,590.00 | నాసిరకం ఆహారం, అరకొర కేటాయింపులు, ఆయాల జీతాలు, సరుకుల బిల్లులు సైతం 8-9 నెలలు పెండింగ్‌లోనే.. ఖర్చు చేసింది ఏటా సగటున కేవలం రూ. 450 కోట్లు మాత్రమే.. |
| పాఠశాలల్లో "నాడు-నేడు" మొదటి దశ / రెండో దశ (మూడు దశల్లో రూ.17,805 కోట్ల వ్యయంతో మొత్తం 45,975 స్కూల్స్‌లో అభివృద్ధి పనులు..) | 15,715 (స్కూల్స్) / 22,344 (స్కూల్స్) | 3,669.00 / 8,000.00 | శిథిలావస్థలో బడులు.. సౌకర్యాల లేమి.. |
| వైఎస్సార్ సంపూర్ణ పోషణ (గర్భిణులు, బాలింతలు, 6 నెలల నుండి 6 ఏళ్ల వయస్సు పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారం..) | 35,70,675 | 6,141.34 | నామమాత్రంగా పౌష్టికాహారం.. అదీ కొందరికే పరిమితం.. ఏటా సగటున ఖర్చు చేసింది కేవలం రూ. 500 కోట్లు మాత్రమే.. |
| స్వేచ్ఛ (శానిటరీ నాప్‌కిన్స్) (కట్టుబాట్ల నుండి స్వేచ్ఛలోకి..) | 10,01,860 | 32.00 | లేదు |
| డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ.. 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు | 5,18,740 | 685.87 | లేదు |
| జగనన్న విద్యా దీవెన (పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్) | 26,98,728 | 10,636.67 | ఇచ్చినవే అరకొర ఫీజులు - అవీ ఏళ్ళ తరబడి పెండింగులు.. గత ప్రభుత్వం పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.1,778 కోట్లు కూడా జగనన్న ప్రభుత్వమే చెల్లించింది.. ఫీజు రీయింబర్స్‌మెంట్ దుస్థితి ఇదయితే ఇక వసతిదీవెన సంగతి దేవుడెరుగు.. |
| జగనన్న వసతి దీవెన (వసతి, భోజన ఖర్చుల కోసం..) | 25,17,245 | 4,275.76 | |
| జగనన్న విదేశీ విద్యా దీవెన (QS మరియు TIMES ర్యాంకుల ప్రకారం వరల్డ్ టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్ మెంట్..) | 1,858 | 132.41 | ఇచ్చింది అరకొర.. అదీ తమవారికే..! కాలేజీల ఎంపికలో కొరవడిన ప్రమాణాలు.. ఫీజుల చెల్లింపులో పెద్ద ఎత్తున బకాయిలు.. 2016-17 నుండి రూ. 318 కోట్లు ఫీజు బకాయిలు.. |
| వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా (చదువును ప్రోత్సహించేలా వధూవరులిద్దరికీ 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి) | 16,668 | 125.50 | ఇచ్చిందే తక్కువ.. వివిధ వర్గాలకు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన దాంట్లో సగం కూడా లేదు.. బీసీలకు ఇచ్చింది కేవలం ఒక సంవత్సరమే.. అది కూడా 2018 అక్టోబర్ నుండి ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసిన దుస్థితి.. రూ. 68.68 కోట్లు వివాహ ప్రోత్సాహకాలను చెల్లించకుండా ఎగ్గొట్టిన పరిస్థితి.. |
| **మొత్తం** | | **రూ. 60,329.42 కోట్లు** | |

"జగనన్న విద్యా కానుక "ద్వారా పొందిన వస్తువుల్లో ఏమైనా ఇబ్బందులుంటే విద్యార్థులు తమ స్కూల్ హెడ్మాస్టర్ కు వాటిని అందిస్తే వారం రోజుల్లో రీప్లేస్ చేస్తారు.

మరే ఇతర ఫిర్యాదులున్నా **14417** టోల్ ఫ్రీ నంబర్ కి కాల్ చేయండి..




శ్రీ. బొత్స సత్యనారాయణ, విద్యా శాఖా మాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం